www.epaper.asthramdaily.com

RNI : TGTEL/25/A1872

సామాన్యుడి అస్త్రం

తెలుగు దిన పత్రిక

సంగారెడ్డి- హైదరాబాద్ | సోమవారం,సెప్టెంబర్21.2026 | ఎడిటర్: పి. జయరాం | సంపుటి: 1 | సంచిక:200 | పేజీలు: 8 | వెల: రూ.5/-

రష్యా పార్లమెంట్ ఎన్నికల చివరి రోజున ఉక్రెయిన్

రష్యా పార్లమెంట్ ఎన్నికల చివరి రోజున ఉక్రెయిన్ దళాలు మాస్కోపై భీకర డ్రోన్, క్షిపణి దాడికి పాల్పడ్డాయి. ఈ దాడిలో కీలకమైన చమురు శుద్ధి కర్మాగారం దెబ్బతినడంతో పాటు ముగ్గురు పౌరులు మరణించారు. యుద్ధం మొదలైనప్పటి నుంచి మాస్కో ప్రాంతంపై ఇదే అతిపెద్ద దాడిగా రష్యా అధికారులు పేర్కొన్నారు.శనివారం అర్ధరాత్రి మొదలైన ఈ దాడిలో ఉక్రెయిన్ వేలాది డ్రోన్లను ప్రయోగించినట్లు తెలుస్తోంది. వీటిలో 1,100కు పైగా డ్రోన్లను కూల్చివేశామని రష్యా రక్షణ శాఖ ప్రకటించింది. అయితే, 1,600 డ్రోన్లను అడ్డుకున్నామని మాస్కో మేయర్ సెర్గీ సోబ్యానిన్ తెలిపారు. ఈ దాడిలో గాజ్‌ప్రామ్‌కు చెందిన కపోట్న్యా చమురు శుద్ధి కర్మాగారంలో మంటలు చెలరేగాయి.20 మందికి పైగా గాయపడగా, సోఫినోలోని ఓ లాజిస్టిక్స్ కేంద్రం, నివాస భవనాలు కూడా దెబ్బతిన్నాయి. భద్రతా కారణాల రీత్యా మాస్కోలోని నాలుగు విమానాశ్రయాల్లో విమానాల రాకపోకలపై తాత్కాలికంగా ఆంక్షలు విధించారు.



తెలంగాణకు భారీ వర్ష సూచన..

- బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా తెలంగాణకు వర్ష సూచన
- రానున్న మూడు రోజుల పాటు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తీవ్ర వాయుగుండంగా మారే అవకాశం ఉండటంతో తెలంగాణలో రానున్న మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో పాటు బలమైన ఈదురుగాలులు కూడా వీస్తాయని ఆదివారం విడుదల చేసిన బులెటిన్‌లో స్పష్టం చేసింది.



ఏపీ, తెలంగాణ మధ్య ప్రత్యేక రైళ్లు

- దసరా పండుగ రద్దీ దృష్ట్యా దక్షిణ మధ్య రైల్వే ప్రకటన
- చర్లపల్లి - శ్రీకాకుళం మధ్య మొత్తం 16 సర్వీసులు

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

దసరా పండుగ నేపథ్యంలో ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని దక్షిణ మధ్య రైల్వే కీలక నిర్ణయం తీసుకుంది. రద్దీని నివారించేందుకు చర్లపల్లి – శ్రీకాకుళం మధ్య 16 ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు ప్రకటించింది. ప్రయాణికుల సౌకర్యార్థం ఈ రైళ్లను అక్టోబర్, నవంబర్ నెలల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు.

భూ హక్కులను కాపాడటమే
ప్రజాప్రభుత్వ ధ్యేయం

- కేసీఆర్ ఫామ్‌హౌస్‌పై విచారణ నేపథ్యంలో దళిత రైతులకు నోటీసులు
- దళితుల భూములపై మంత్రి పొంగులేటి భరోసా
- భూ రికార్డుల పరిశీలన హక్కుల పరిరక్షణకేనని, భూసేకరణ కాదని వివరణ
- బీఆర్ఎస్ నేతల మాటలు నమ్మొద్దు.. దళితుల భూములకు సంపూర్ణ రక్షణ
- రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టీకరణ
- కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేస్తున్నారని ఆరోపణ

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

రాష్ట్రంలోని దళితుల భూముల్లో అంగుళం కూడా ప్రభుత్వం తీసుకోదని, వారి భూములకు పూర్తి భద్రత కల్పిస్తామని తెలంగాణ రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదివారం స్పష్టం చేశారు. దళితులు, గిరిజనుల భూములను లాక్కోవడం ప్రజల ప్రభుత్వ విధానం కాదని ఆయన తేల్చిచెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం దళితుల భూములకు పూర్తి రక్షణ కవచంగా నిలుస్తుందని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని హామీ ఇచ్చారు.దళితులు, గిరిజనులు, బడుగు బలహీన వర్గాల ఆశీస్సులతోనే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందని పొంగులేటి పేర్కొన్నారు. సామాజిక న్యాయం, పేదల సంక్షేమం కాంగ్రెస్ ప్రభుత్వాల ప్రధాన ప్రాధాన్యతలని అన్నారు. భూసంస్కరణలు, భూ పంపిణీ వంటి చారిత్రక నిర్ణయాలతో నిరుపేద దళితులకు భూములు ఇచ్చి హక్కులు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని తెలిపారు. తెలంగాణ ప్రాంతంలో సుమారు 25 లక్షల ఎకరాల భూమిని దళితులకు, 2 లక్షల ఎకరాల పోడు భూములను గిరిజనులకు పంపిణీ చేసిన ఘనత కాంగ్రెస్‌దేనని పేర్కొన్నారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి మోసం చేసిన 'దొర' కేసీఆర్ మాటలను నమ్మవద్దని ఆయన ప్రజలను కోరారు.మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కు చెందిన ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌పై విచారణ జరుపుతామని సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఈ వివాదం మొదలైంది. ఈ ఫామ్‌హౌస్ దా దాపు 700 ఎకరాల్లో విస్తరించి ఉందని, అందులో 388 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని ముఖ్యమంత్రి ఆరోపించారు.



ప్రతి ఒక్కరూ సమన్వయంతో
పనిచేయాలి

- ఎల్ నినో ప్రభావం, ప్రభుత్వ కార్యాచరణపై సీఎం చంద్రబాబు సమీక్ష
- రైతులను ఆదుకోవడం, నిత్యావసరాల ధరల నియంత్రణే ప్రధాన లక్ష్యం
- బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలు అదుపులో ఉంచాలని ఆదేశం



అమరావతి,సామాన్యుడి అస్త్రం

రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, తీసుకోవాల్సిన చర్యలు, కార్యాచరణ ప్రణాళిక అమలుపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. వివిధ శాఖల ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లు, ఆర్ఎస్కే సిబ్బందితో ఆయన టెలీకాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. ఎల్ నినో వంటి విపత్కర పరిస్థితుల్లో రైతులను ఆదుకోవడం, మార్కెట్‌లో నిత్యావసరాల ధరలు పెరగకుండా నియంత్రించడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాలని ఆయన స్పష్టం చేశారు. ఈ విపత్తును ఒక సవాలుగా స్వీకరించి, ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ, "ఎల్ నినో పరిస్థితులను మనం ముందుగానే అంచనా వేశాం. దీనికోసం సిద్ధం చేసుకున్న యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలి. ఎల్ నినో ప్రభావం కేవలం రైతులపైనే కాదు, అన్ని వ్యవస్థలపైనా పడుతుంది. కాబట్టి రైతులను కాపాడుకుంటూనే, వినియోగదారులపై ధరల భారం పడకుండా చూడటం మన బాధ్యత" అని అన్నారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు వంటి నిత్యావసరాల ధరలను కచ్చితంగా అదుపులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. గోదాముల్లోని బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసి, ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉల్లి కొరతను అధిగమించేందుకు ఇతర ప్రాంతాల నుంచి కొనుగోలు చేయడంతో పాటు, భవిష్యత్ డిమాండ్‌కు అనుగుణంగా ఉల్లి సాగును ప్రోత్సహించాలని తెలిపారు.

ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి
ముహూర్తం ఖరారు

- ఈ ఏడాది 12 రోజుల పాటు కొనసాగనున్న ఉత్సవాలు
- సెప్టెంబర్ 25న హుస్సేన్ సాగర్‌లో విగ్రహ నిమజ్జనం
- శ్రీ పంచముఖ సంకటహర మహా గణపతిగా దర్శనమిస్తున్న వినాయకుడు

అమరావతి,సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్‌లోని ప్రసిద్ధ ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనం తేదీ ఖరారైంది. ఈ ఏడాది సెప్టెంబర్ 25న, శుక్రవారం రోజున గణనాథుడిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేయనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రకటించింది.



సూర్యాపేటలో ఘోర ప్రమాదం..

- డివైడర్‌ను ఢీకొట్టి కారులో చెలరేగిన మంటలు
- ఖమ్మం న్యూరో సర్జన్ కాసకుర్తి జగదీశ్ సజీవదహనం
- తలుపులు లాక్ అవ్వడంతో బయటకు రాలేకపోయిన వైద్యుడు

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

సూర్యాపేట జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో మంటలు చెలరేగి, అందులో ప్రయాణిస్తున్న ప్రముఖ న్యూరో సర్జన్ సజీవదహనమయ్యారు. ఈ విషాద ఘటన పిల్లల మర్రి శివారులోని హైదరాబాద్–ఖమ్మం జాతీయ రహదారిపై జరిగింది.వివరాల్లోకి వెళితే.. ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాసకుర్తి జగదీశ్, తన కారులో ఖమ్మం వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన జ రిగింది.





ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే
ప్రమాదకరం

- అవకాశం ఉన్నా కరెంట్ ఇవ్వకుండా లేని కరవును సృష్టిస్తున్నారంటూ హరీశ్ రావు ఫైర్
- 24 గంటల కరెంట్ పోయి 6-7 గంటలకే పరిమితమైందని విమర్శలు

కరీంనగర్‌లో దొంగల హల్‌చల్..
గ్యాస్ కట్టర్లతో రెండు ఏటీఎంలు లూటీ

- కరీంనగర్‌లో రెండు ఎస్‌బీఐ ఏటీఎంలలో భారీ చోరీ
- గ్యాస్ కట్టర్లతో మిషన్లు ధ్వంసం చేసి నగదు అపహరణ

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

కరీంనగర్ పట్టణంలో ఇవాళ తెల్లవారుజామున దొంగలు రెచ్చిపోయారు. పట్టణంలోని రెండు వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ఏటీఎంలను లక్ష్యంగా చేసుకుని భారీగా నగదును అపహరించుకుపోయారు.



భద్రాద్రిలో తీవ్ర విషాదం

- ఆడుకుంటూ కారు ఎక్కడంతో లాక్ అయిన డోర్లు
- గంటల పాటు గాలించిన తర్వాత కారులో గుర్తించిన కుటుంబసభ్యులు

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో తీవ్ర విషాదం నెలకొంది. ఆడుకుంటూ పార్క్ చేసిన కారులోకి వెళ్లిన నాలుగేళ్ల చిన్నారి, డోర్లు లాక్ కావడంతో ఊపిరాడక ప్రాణాలు కోల్పోయింది. ఈ హృదయ విదారక ఘటన జూలూరుపాడు మండలం వినోభా నగర్ గ్రామంలో చోటుచేసుకుంది.



ఆదిలాబాద్‌లో విషాదం

- 24 గంటల వ్యవధిలో భార్యాభర్తలు మృతి
- కామెర్ల వ్యాధితో భార్య, ఆపై కొన్ని గంటలకే భర్త కన్నుమూత



భూ హక్కులను కాపాడటమే ప్రజాప్రభుత్వ ధ్యేయం



మొదటి పేజి తరువాయి

భూమిలేని దళితులకు భూ సంస్కరణలు, భూ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా భూములు ఇచ్చి ఆ భూమిపై హక్కు కల్పించిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వాలకు ఉందని తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ హయాంలో దళితులకు సుమా రు 25 లక్షల ఎకరాల భూముల పంపి ణీ, అలాగే పోడు భూముల విషయంలో గిరిజనులకు సుమారు 2 లక్షల ఎకరాలపై హక్కులు కల్పించిన ఘనత కూడా కాంగ్రెస్‌దేని ఆయన వివరించారు.

భూ హక్కులు కాపాడుతాం..

భూమిలేని వారికి భూమి, హక్కులు లేని వారికి హక్కులు కల్పించడమే కాంగ్రెస్ విధానమని.. దళిత, గిరిజనుల భూ హక్కులను కాపాడుతూ ప్రజా ప్రభుత్వం ముందుకు సాగుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. అధికారంలోకి వస్తే దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హామీ ఇచ్చి, అధి కారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీని విస్మరించారని, ఆ పార్టీ నేతల మాటలు నమ్మొద్దని సూచించారు.సీఎం రేవంత్ తరఫున రెవెన్యూ శాఖ మంత్రిగా దళిత కుటుంబాలకు తాను స్పష్టమైన హామీ ఇస్తున్నానని పొంగులేటి తెలిపారు. “అంగుళం భూమి కూడా ప్రభుత్వం లాక్కోదు. మీ భూ మిని తీసుకునే ఆలోచన కూడా ఈ ప్రభుత్వానికి లేదు. మీ భూముల విషయంలో మీరు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదు. ప్రజా ప్రభుత్వం మీకు అండగా ఉంటుంది” అని పేర్కొన్నారు.సమస్యలకు పరిష్కారం..భూములకు సంబంధించిన రికార్డుల పరిశీలన, సర్వేలు, భూ సమస్యల పరిష్కా రం వంటి ప్రక్రియలను ప్రజల భూములను లా క్కోవడానికి చేస్తున్న చర్యలుగా విషప్రచా రం చేస్తున్నారని.. ఆ తప్పుడు ప్రచారాన్ని నమ్మొద్దని కోరారు. భూములపై ప్రజలకు ఉన్న హక్కులను స్పష్టంగా నమోదు చేయ డం, భూ వివాదాలను పరిష్కరించడం, భూ హక్కులకు రక్షణ కల్పించడమే ప్రభుత్వ ఉద్దేశమని ఆయన తెలిపారు. “దళితుల భూము ల విషయంలో కొంతమంది దొరలు కావాలనే భయాందోళనలు సృష్టిస్తూ విషప్రచా రం చేస్తున్నారు.తమ స్వార్థ ప్రయోజనాల కోసం దళితులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నించారు. అలాంటి ప్రచారాల విషయంలో అప్రమత్తంగా ఉండాలి” అని సూచించారు. ప్రభుత్వం తీసుకునే ప్రతి చర్య చట్టబద్ధంగా, పారదర్శకంగా ఉంటుందని స్పష్టం చేశారు. రీ-సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను గుర్తించి దళితులకు, గిరిజనులకు హ క్కులు కల్పిస్తున్నామని మంత్రి పొంగులేటి చెప్పారు.సూర్యాపేట జిల్లా నూతనకల్, మద్దిరాల ప్రాంతంలోని 15 రెవెన్యూ గ్రా మాల్లో, మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం నారాయణపురం గ్రామంలో ద శాబ్దాల భూ సమస్యలకు పరిష్కారం చూ పించామని వివరించారు. భూమిపై హక్కు లు కల్పించడం ద్వారా వారికి ప్రభుత్వ పథకాలు, ఇతర ప్రయోజనాలు అందేలా చర్య లు తీసుకుంటున్నామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

తెలంగాణకు భారీ వర్ష సూచన.. మూడు రోజులు అప్రమత్తం

మొదటి పేజి తరువాయి

సోమవారానికి వాయుగుండంగా,
మంగళవారానికి తీవ్ర వాయుగుండంగా
బలపడనున్న అల్పపీడనం
గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో
ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులు
సెప్టెంబర్ 24న పలు జిల్లాల్లో అతి భారీ
వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ
హెచ్చరిక



వివరాల్లోకి వెళితే, ఆది, సోమ, మంగళవారాల్లో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో అక్కడక్కడా భారీ వర్షాలు పడొచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఇదే సమయంలో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తూ, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఆదివారం ఉదయం ఉత్తర అండమాన్ సముద్రం, దాని పరిసర ప్రాంతాల్లో కేంద్రీకృతమైన అల్పపీడనం, పశ్చిమ-వాయవ్య దిశగా కదులుతోంది. ఇది సోమవారం (సెప్టెంబర్ 21) నాటికి తూర్పు మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా, మంగళవారం నాటికి పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండంగా బలపడనుంది.బుధవారం ఉదయానికి ఈ వాయుగుండం ఉత్తర ఆంధ్రప్రదేశ్-దక్షిణ ఒడిశా తీరాలకు సమీపంలోకి చేరుకుంటుందని అంచనా వేస్తున్నారు. దీని ప్రభావంతో సెప్టెంబర్ 24న తెలంగాణలోని మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ ప్రత్యేకంగా హెచ్చరించింది. అలాగే ఆదిలాబాద్, కొమురం భీమ్ ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల సహా మరికొన్ని జిల్లాల్లో గంటకు 50-60 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని తెలిపింది.ఇదిలా ఉండగా, దక్షిణ కోస్తాంధ్ర, దాని పరిసర పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్ర మట్టానికి 0.9 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని వాతావరణ కేంద్రం వివరించింది. గడిచిన 24 గంటల్లో నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో అత్యధికంగా 13.9 సెం.మీ., ములుగు జిల్లా ఏటూరునాగారంలో 10.4 సెం.మీ. వర్షపాతం నమోదైంది. తాజా హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు, రైతులు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు.

ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే ప్రమాదకరం: హరీశ్ రావు

మొదటి పేజి తరువాయి


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్ రావు సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రకృతి విపత్తు అయిన ఎల్ నినో కంటే రేవంత్ రెడ్డే రాష్ట్రానికి అత్యంత ప్రమాదకరమని ఆయన తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కరెంట్ కోతలు విధిస్తూ, నీళ్లు ఇవ్వకుండా రైతులను ఇబ్బంది పెడుతోందని, రాష్ట్రంలో లేని కరవును సృష్టిస్తోందని ఆరోపించారు.యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరులో పలువురు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హరీశ్ రావు మాట్లాడారు. రాష్ట్రంలో జరుగుతున్న సర్వేలన్నీ కేసీఆర్‌కు అనుకూలంగా ఉన్నాయని, అందుకే కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి చేరికలు పెరిగాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు ప్రభుత్వమని చెప్పుకుంటూనే రాక్షస పాలన సాగిస్తోందని విమర్శించారు.”అవకాశం ఉన్నప్పటికీ విద్యుదుత్పత్తి చేయకుండా బొగ్గు కొరత అనే సాకుతో కరెంట్ కోతలు విధిస్తున్నారు. కేసీఆర్ గారి హయాంలో 24 గంటల ఉచిత కరెంట్ ఇస్తే.. ఇప్పుడు కేవలం 6-7 గంటల నాణ్యత లేని విద్యుత్ మాత్రమే వస్తోంది. దీంతో పంటలు ఎండిపోతున్నాయి. కృష్ణా నదిలో నీళ్లున్నా కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ వంటి లిఫ్టులను ఆన్ చేయడం లేదు,” అని హరీశ్ రావు మండిపడ్డారు.మూడు పంటల నుంచి రైతుబంధు నిధులు విడుదల చేయలేదని, కరోనా కష్టకాలంలో కూడా కేసీఆర్ ప్రభుత్వం రైతుబంధు ఆపలేదని గుర్తుచేశారు. యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిపై ప్రమాణం చేసి కూడా సీఎం రేవంత్ రెడ్డి దేవుణ్ని మోసం చేశారని ఆరోపించారు. బాండ్ పేపర్లపై ఇచ్చిన 420 హామీలు, గొర్రెల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ వంటి పథకాల ఊసే లేదని విమర్శించారు. తనను ప్రశ్నించినందుకు పిట్ట బెదిరింపులకు పాల్పడితే భయపడేది లేదని, ఆయన సంగతి చూస్తామని హెచ్చరించారు.”కేసీఆర్‌పై బురద చల్లితే రైతులకు న్యాయం జరగదు. పాలించడం చేతకాకపోతే నుదుటిపై ‘నామమ్’ రాసుకుని ప్రజలకు క్షమాపణ చెప్పాలి” అని హరీశ్ రావు హితవు పలికారు.

కరీంనగర్‌లో దొంగల హల్‌చల్.. గ్యాస్ కట్టర్లతో రెండు ఏటీఎంలు లూటీ

మొదటి పేజి తరువాయి

దొంగల ముఠాలో మహిళ.. సీసీటీవీ
ఫుటేజీలో గుర్తింపు
మహారాష్ట్ర రిజిస్ట్రేషన్ వాహనంలో పరారైన
దుండగులు
దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు
చేసిన పోలీసులు

వివరాల్లోకి వెళితే.. కరీంనగర్ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని దుర్శేడ్, ఎల్ఎండీ పోలీస్ స్టేషన్ పరిధిలోని తిమ్మాపూర్‌లో ఉన్న ఎస్‌బీఐ ఏటీఎంలలో ఈ చోరీలు జరిగాయి. దుర్శేడ్ ఏటీఎంలోకి తెల్లవారుజామున 3:30 గంటల సమయంలో కారులో వచ్చిన ఇద్దరు దుండగులు, వారిలో ఒక మహిళ కూడా ఉన్నట్లు సీసీటీవీ ఫుటేజీ ద్వారా పోలీసులు గుర్తించారు. ఏటీఎంలోకి ప్రవేశించగానే వారు సీసీ కెమెరాలపై ఒక రకమైన ద్రవాన్ని చల్లి, ఆ తర్వాత గ్యాస్ కట్టర్‌తో మిషన్‌ను కట్ చేశారు. ఈ ఏటీఎం నుంచి సుమారు రూ. 8 లక్షలు అపహరించినట్లు ప్రాథమికంగా నిర్ధారించారు. తిమ్మాపూర్ ఏటీఎంలో ఎంత నగదు పోయిందనేది ఇంకా తెలియరాలేదు.దొంగతనానికి పాల్పడినప్పుడు నిందితులు టోపీలు, కళ్లద్దాలు, మాస్కులు, గ్లోవ్‌లు ధరించి తమ గుర్తింపు తెలియకుండా జాగ్రత్తపడ్డారు. దుర్శేడ్ ఏటీఎంలో చోరీ జరుగుతున్న సమయంలోనే ఎస్‌బీఐ ఢిల్లీ కార్యాలయానికి అలారం వెళ్లింది. దీంతో వారు స్థానిక అధికారులను అప్రమత్తం చేశారు.ఈ ఘటనలపై పోలీసులు రెండు వేర్వేరు కేసులు నమోదు చేసి, దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితులను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను రంగంలోకి దించారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలతో పాటు సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా విశ్లేషిస్తున్నారు. దొంగలు మహారాష్ట్ర రిజిస్ట్రేషన్‌తో ఉన్న వాహనాన్ని ఉపయోగించినట్లు గుర్తించారు. ఈ వాహనాన్ని ట్రేస్ చేయడానికి టోల్‌ప్లాజాల వద్ద ఉన్న సీసీటీవీ ఫుటేజీలను కూడా పరిశీలిస్తున్నారు.ఇటీవల కాలంలో తెలంగాణలో ఏటీఎం దొంగతనాలు పెరిగిపోవడం ఆందోళన కలిగిస్తోంది. గత మే నెలలో మహబూబ్‌నగర్‌లో ఇలాగే ఒక ఎస్‌బీఐ ఏటీఎంను గ్యాస్ కట్టర్‌తో కోసి రూ. 2.30 లక్షలు ఎత్తుకెళ్లారు. వరుసగా జరుగుతున్న ఈ ఘటనల నేపథ్యంలో ఏటీఎంల వద్ద భద్రతను కట్టుదిట్టం చేసే విషయంపై పోలీసు అధికారులు బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నారు.



సూర్యాపేటలో ఘోర ప్రమాదం..

మొదటి పేజి తరువాయి

వివరాల్లోకి వెళితే.. ఖమ్మంలోని మమత ఆసుపత్రిలో న్యూరో సర్జన్‌గా పనిచేస్తున్న డాక్టర్ కాసుకుర్తి జగదీశ్, తన కారులో ఖమ్మం వైపు వెళ్తుండగా ఈ దుర్ఘటన జరిగింది. పిల్లలమర్రి వద్దకు రాగానే ఆయన ప్రయాణిస్తున్న కారు అకస్మాత్తుగా అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ప్రమాదం జరిగిన వెంటనే కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు కారు మొత్తం వ్యాపించడంతో డోర్లు లాక్ అయ్యాయి.దీంతో డాక్టర్ జగదీశ్ బయటకు వచ్చే అవకాశం లేకపోయింది. అగ్నిగోళంలా మారిన కారులో ఆయన మంటల్లో చిక్కుకుని అక్కడికక్కడే సజీవదహనమయ్యారు. రహదారిపై వెళ్తున్న ఇతర వాహనదారులు ఈ దృశ్యాన్ని చూసి వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖైరతాబాద్ మహాగణపతి నిమజ్జనానికి ముహూర్తం ఖరారు



మొదటి పేజి తరువాయి

ప్రతి ఏటా 11 రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలు, ఈసారి ఒక రోజు అదనంగా 12 రోజుల పాటు కొనసాగనుండటం విశేషం. దీంతో భక్తులకు స్వామి వారిని దర్శించుకునేందుకు అదనపు సమయం లభించనుంది.ప్రతి సంవత్సరం మాదిరిగానే, ఈసారి కూడా భారీ ఏర్పాట్ల మధ్య మహాగణపతిని హుస్సేన్ సాగర్‌లో నిమజ్జనం చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిమజ్జనం తేదీ ఖరారు కావడంతో, భక్తులు మరియు నగర వాసులలో ఉత్సాహం నెలకొంది.

ఏపీ, తెలంగాణ మధ్య ప్రత్యేక రైళ్లు

మొదటి పేజి తరువాయి

షెడ్యూల్ వివరాల ప్రకారం.. రైలు నంబర్ 07037 (చర్లపల్లి – శ్రీకాకుళం) అక్టోబర్ 6, 13, 20, 27 తేదీలతో పాటు నవంబర్ 3, 10, 17, 24 తేదీల్లో నడవనుంది. తిరుగు ప్రయాణంలో రైలు నంబర్ 07038 (శ్రీకాకుళం – చర్లపల్లి) అక్టోబర్ 7, 14, 21, 28 మరియు నవంబర్ 4, 11, 18, 25 తేదీల్లో ప్రయాణికులకు అందుబాటులో ఉంటుంది.ఈ ప్రత్యేక రైళ్లు నల్గొండ, మిర్యాలగూడ, గుంటూరు, విజయవాడ, ఏలూరు, తాడేపల్లిగూడెం, రాజమండ్రి, సామర్లకోట, దువ్వాడ, సింహాచలం, కొత్తవలస, విజయనగరం, చీపురుపల్లి స్టేషన్లలో ఆగుతాయి.

ఆదిలాబాద్‌లో విషాదం..

మొదటి పేజి తరువాయి

కొంతకాలంగా లత పచ్చకామెర్ల వ్యాధితో బాధపడుతున్నారు. ఈ క్రమంలో జగిత్యాలలో చికిత్స తీసుకుని శుక్రవారం తిరిగి వస్తుండగా మార్గమధ్యలోనే ఆమె ప్రాణాలు విడిచారు. శనివారం మధ్యాహ్నం కుటుంబ సభ్యులు, బంధువుల సమక్షంలో ఆమె అంత్యక్రియలు నిర్వహించారు.భార్య మరణంతో తీవ్ర వేదనకు గురైన నవీన్ కుమార్, శనివారం రాత్రి 8:30 గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. ఆయన కూడా కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ ఇంటి వద్దనే ఉంటున్నారని తెలిసింది. భార్య చనిపోయిన కొన్ని గంటలకే భర్త కూడా మరణించడంతో ఆ కుటుంబంలో తీరని శోకం మిగిలింది. భార్య మరణాన్ని తట్టుకోలేకనే నవీన్ గుండె ఆగిపోయి ఉంటుందని స్థానికులు, బంధువులు భావిస్తున్నారు.


భద్రాద్రిలో తీవ్ర విషాదం

మొదటి పేజి తరువాయి

స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ సర్పంచ్ గంగావత్ నవీన్ కుమార్తె తన్విశ్రీ (4) ఇంటి ఆవరణలో ఆడుకుంటూ, అక్కడ నిలిపి ఉంచిన కారులోకి వెళ్ళింది. అయితే, కారు డోర్లు వాటంతట అవే లాక్ కావడంతో చిన్నారి లోపలే చిక్కుకుపోయింది. దీన్ని ఎవరూ గమనించకపోవడంతో సుమారు రెండు గంటల పాటు బాలిక కారులోనే ఉండిపోయింది. పాప ఎంతకీ కనిపించకపోవడంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో గాలించారు.చివరికి అనుమానంతో కారులో పరిశీలించగా, ముందు సీట్ల మధ్య చిన్నారి అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించారు. వెంటనే కారు అద్దాలు పగలగొట్టి పాపను బయటకు తీసి కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే, అప్పటికే చిన్నారి మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. కారులో గాలి ఆడకపోవడం వల్లే ఊపిరాడక బాలిక మరణించిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పార్క్ చేసిన వాహనాల వద్ద పిల్లలు ఆడుకుంటున్నప్పుడు అప్రమత్తంగా ఉండాలని, కార్లను లాక్ చేసే ముందు లోపల ఎవరూ లేరని నిర్ధారించుకోవాలని పోలీసులు తల్లిదండ్రులకు సూచించారు.

శేరిలింగంపల్లిలో ఎంఆర్పీఎస్‌కు కొత్త సారథ్యం..
మండల అధ్యక్షుడిగా జగపతి అంజయ్య మాదిగ

- ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడిగా జగపతి అంజయ్య మాదిగ నియామకం
- రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ రావుగళ్ళ బాబు మాదిగ ప్రకటన
- మాదిగ రిజర్వేషన్ పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని నూతన కార్యవర్గం వెల్లడి



సామాన్యుడి అస్త్రం / శేరిలింగంపల్లి :

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎంఆర్పీఎస్), ఎంఎస్పీ శేరిలింగంపల్లి మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ప్రకటించారు. ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ నియామకాల్లో ఎంఆర్పీఎస్ మండల అధ్యక్షుడిగా జగపతి అంజయ్య మాదిగను నియమించినట్లు రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జ్ రావుగళ్ళ బాబు మాదిగ వెల్లడించారు.నూతన కార్యవర్గంలో ఎంఆర్పీఎస్ అధికార ప్రతినిధిగా సాంసంగ్ మాదిగ, ఎంఎస్పీ మండల అధ్యక్షుడిగా సుదర్శన్ మాదిగ, ఎంఎస్పీ అధికార ప్రతినిధిగా సింగారం దాసరి రాజు మాదిగను నియమించినట్లు తెలిపారు. సంస్థ సూచనల మేరకు శేరిలింగంపల్లి మండల పరిధిలో ఉద్యమ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టనున్నట్లు నూతన బాధ్యులు పేర్కొన్నారు.ఈ సందర్భంగా జగపతి అంజయ్య మాదిగతో పాటు నూతన కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ.. మంద కృష్ణ మాదిగ ఆశీస్సులతో ఎంఆర్పీఎస్, ఎంఎస్పీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తామన్నారు. మాదిగల హక్కులు, రిజర్వేషన్లకు సంబంధించిన అంశాలపై నిరంతరం పోరాడుతూ ఉద్యమాన్ని ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్తామని తెలిపారు. తమపై ఉంచిన బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తిస్తామని పేర్కొన్నారు.కార్యక్రమంలో ఐత రమేష్ మాదిగ, సింగ దాసరి, నరేష్ మాదిగ, రాజేష్ మాదిగతో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పూర్తిస్థాయి సెక్రటరీగా ఐఏఎస్ నియామకంపై కసరత్తు



- సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ
- ఇన్‌చార్జి సెక్రటరీగా నాన్-ఐఏఎస్
- నిబంధనలకు విరుద్ధంగా నియామకంపై సీఎం సీరియస్
- సాంఘిక సంక్షేమ గురుకుల సొసైటీ ఇన్‌చార్జి సెక్రటరీగా నాన్-ఐఏఎస్ నియామకంపై వివాదం నెలకొంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆరా తీయడంతో సీనియర్ ఐఏఎస్‌ను పూర్తిస్థాయి సెక్రటరీగా నియమించే అంశంపై ప్రభుత్వం కసరత్తు చేస్తోంది.

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

లక్షలాది మంది విద్యార్థులు.. వందల గురుకులాలు.. వేల మంది సిబ్బందితో కూడిన తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల సొసైటీ కార్యదర్శి పోస్టులో నిబంధనలకు విరుద్ధంగా తొలిసారి నాన్-ఐఏఎ?స అధికారిని ఇన్‌చార్జి (ఎఫ్ఏసీ)గా నియమించటంపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీంతో ఈ వ్యవహారంపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆరా తీసినట్లు తెలిసింది. ఇంత పెద్ద సొసైటీకి నాన్-ఐఏఎ?స అధికారిని సెక్రటరీగా ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించినట్లు సమాచారం.దీంతో త్వరలో సొసైటీకి సీనియర్ ఐఏఎస్ అధికారిని కార్యదర్శిగా నియమించే అవకాశాలున్నాయని సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈ పోస్టులో సమర్థులైన ఒక ఐఏఎస్ అధికారిని పూర్తిస్థాయి సెక్రటరీగా నియమించాలని ఆ శాఖ మంత్రి తీవ్రంగా ప్రయత్నించినప్పటికీ, సచివాలయానికి చెందిన ఓ ఉన్నతాధికారి తెరవెనుక చక్రం తిప్పి సొసైటీలో సంయుక్త కార్యదర్శిగా ఉన్న కంభంపాటి శారదను ఎఫ్ఏసీగా నియమించినట్లు ఆరోపణలున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా సొసైటీలో జరుగుతున్న పరిణామాలు, అంతర్గత సమాచారం లీకవుతుండటం వంటి అంశాలపై తాజాగా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టి సారించి వివరాలు సేకరించినట్లు సమాచారం.సరైన అర్హత లేకున్నా అంతటి భారీ వ్యవస్థకు ఇన్‌చార్జిగా ఎలా ఉంచుతారు? అని ఉన్నతాధికారులను ప్రశ్నించటంతో గురుకుల వర్గాల్లో ఒక్కసారిగా కదలిక వచ్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1986లో ఏర్పడిన ఈ సొసైటీకి ఇప్పటివరకు 60 మందికి పైగా సెక్రటరీలుగా పనిచేశారు. వారిలో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ మాత్రమే ఐపీఎస్ కాగా... మిగిలిన వాళ్లంతా ఐఏఎస్ అధికారులే. అలగు వర్షిణి బదిలీ తర్వాత.. కృష్ణ ఆదిత్యకు ఎఫ్ఏసీ ఇచ్చి.. ఆ తర్వాత పూర్తిస్థాయి అధికారిగా విజయేంద్రబోయిని ప్రభుత్వం నియమించింది. ఆమె ఎస్సీడీడీ కమిషనర్‌గా వెళ్లిపోవడంతో.. ఆ స్థానాన్ని అదే సంస్థలో జాయింట్ సెక్రటరీగా ఉన్న కంభంపాటి శారదకు ఇచ్చారు. కేంద్రప్రభుత్వ నిబంధనల ప్రకారం ఈ సొసైటీకి ఐఏఎస్ /ఐపీఎస్ అధికారిని మాత్రమే నియమించాలి. కానీ, కనీసం గ్రూప్-1 అధికారినైనా కాకుండా.. సొసైటీ చరిత్రలో మొదటిసారి నాన్-ఐఏఎ?సను నియమించారు. ఈ వ్యవహారంపై సీఎం స్వయంగా ఆరా తీయటంతో అధికారుల్లో కదలిక వచ్చింది. శారదను బాధ్యతల నుంచి తప్పించి, సీనియర్ ఐఏఎస్ అధికారిని పూర్తిస్థాయి సెక్రటరీగా నియమించేందుకు ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది.

నేను వాళ్లూ, వీళ్లూ వదిలిన బాణాన్ని కాదు: కవిత

- కొడంగల్‌లో పాంచజన్య సంకల్ప సభ
- కొడంగల్ గడ్డపై నుంచి చెబుతున్నా.. నేను ఎవరి బాణాన్ని కాదు అంటూ కవిత వ్యాఖ్యలు
- అధికారానికి దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని నేనని వ్యాఖ్య
- యువత, బహుజనుల కోసం ఎవరితోనైనా పోరాడుతానని ప్రకటన
- అక్షరాస్యత విషయంలో సీఎం రేవంత్ రెడ్డిని ప్రశ్నించిన కవిత



హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

తాను వాళ్లూ వీళ్లూ వదిలిన బాణాన్ని కాదని, దశాబ్దాలుగా అధికారానికి, విద్యకు దూరంగా ఉన్న బహుజనుల బాణాన్ని అని తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. యువత, బహుజనుల హక్కుల కోసం ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి, మాజీ సీఎం కేసీఆర్‌తో అయినా కొట్లాడటానికి సిద్ధమని ఆమె ప్రకటించారు. వికారాబాద్ జిల్లా కొడంగల్‌లో ఆదివారం నిర్వహించిన 'పాంచజన్య సంకల్ప సభ'లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు.సభకు ముందు కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా వేదిక వద్దకు చేరుకున్న కవిత, తన రాజకీయ వైఖరిని వివరిస్తూ ప్రత్యర్థులపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "నన్ను కాంగ్రెస్ వదిలిన బాణమని బీఆర్ఎస్ వాళ్లు, కేసీఆర్ వదిలిన బాణమని రేవంత్‌రెడ్డి అంటున్నారు. మరికొందరు తలకాయ లేనివాళ్లు బీజేపీ బాణమని మాట్లాడుతున్నారు. కొడంగల్ గడ్డపై నుంచి నేను ఒక్కటే చెబుతున్నా. నేను తెలంగాణ బహుజనుల బాణాన్ని. యువజనుల యుద్ధ నినాదాన్ని. అంబేడ్కర్ వాదాన్ని, మహాత్మ జ్యోతిబా ఫులే ఆత్మగౌరవ నినాదాన్ని నేను" అని కవిత ఉద్ఘాటించారు.ఒక మహిళ ఎవరి మద్దతు లేకుండా రాజకీయంగా నిలబడగలదని నిరూపించేందుకే ఇక్కడికి వచ్చానని, ప్రజలు తనకు ధైర్యం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కవిత విమర్శలు చేశారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని గట్టు, కేటీ దొడ్డి మండలాల్లో అక్షరాస్యత రేటు అఫ్గానిస్తాన్‌తో సమానంగా ఉందని, గతంలో విద్యాశాఖ మంత్రిగా పనిచేసిన రేవంత్ రెడ్డి అప్పుడు ఏం చేశారని నిలదీశారు.దేశంలో మహిళలను మహారాణులుగా కీర్తిస్తారని, కానీ వంటింట్లోని గిన్నెల మీద కూడా మగవాళ్ల పేర్లే ఉంటాయని ఆవేదన వ్యక్తం చేశారు. 29 రాష్ట్రాలున్న దేశంలో కేవలం ఒక్క రాష్ట్రానికి మాత్రమే మహిళ ముఖ్యమంత్రిగా ఉన్నారని గుర్తుచేశారు. బహుజనులు, మహిళలు, యువత రాజకీయంగా ఎదిగేందుకు తన పోరాటం కొనసాగుతుందని కవిత తెలిపారు.

బాలాపూర్ వినాయకుడిని దర్శించుకున్న హీరో విజయ్ దేవరకొండ



- బాలాపూర్ గణనాథుని దర్శించుకున్న హీరో విజయ్ దేవరకొండ
- మాజీ మంత్రి సబితా రెడ్డి తనయుడితో కలిసి ప్రత్యేక పూజలు
- విజయ్‌కు లడ్డూ ప్రసాదం అందించి సత్కరించిన ఉత్సవ కమిటీ
- హీరోని చూసేందుకు భారీగా తరలివచ్చిన అభిమానులు

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్ నగరంలో గణేశ్ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్న వేళ, టాలీవుడ్ స్టార్ హీరో విజయ్ దేవరకొండ ప్రసిద్ధ బాలాపూర్ గణనాథుని దర్శించుకున్నారు. శనివారం రాత్రి ఆయన బాలాపూర్ మండపానికి విచ్చేసి గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు పట్లోళ్ల కౌశిక్ రెడ్డితో కలిసి విజయ్ ఈ పూజలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా బాలాపూర్ గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు కళ్లెం నిరంజన్ రెడ్డి, ఇతర సభ్యులు విజయ్ దేవరకొండను శాలువాతో సత్కరించారు. అనంతరం ఎంతో ప్రఖ్యాతిగాంచిన బాలాపూర్ లడ్డూను ప్రసాదంగా అందజేశారు. విజయ్ దేవరకొండ రాకతో మండపం వద్ద సందడి వాతావరణం నెలకొంది.తమ అభిమాన హీరోను చూసేందుకు యువత, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. 'విజయ్ అన్న' అంటూ నినాదాలు చేస్తూ సందడి చేశారు. ఫోటోలు, సెల్ఫీల కోసం ఎగబడటంతో ప్రాంగణమంతా అభిమానులతో నిండిపోయింది. అభిమానుల ఉత్సాహానికి విజయ్ కూడా అభివాదం చేస్తూ స్పందించారు.

సాగునీటి ప్రాజెక్టులపై కాంగ్రెస్ ప్రభుత్వం చిన్నచూపు

- రైతు సమస్యలను గాలికి వదిలిన ప్రభుత్వం
- 22ఏ జాబితాలో భూముల కోసం పోరాడుతాం
- ఇరవై నాలుగు గంటల కరెంటు ఎక్కడిస్తున్నారో చూపాలి
- మాజీ మంత్రి హరీశ్‌రావు



హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తున్నదని, ఎల్ నినో) కంటే సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాదకరంగా మారారని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీశ్‌రావు(విమర్శించారు. ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లా(మోటకొండూరులో హరీశ్ సమక్షంలో పలువురు బీఆర్ఎస్‌లో చేరారు. మోటకొండూరు విద్యుత్ సబ్‌స్టేషన్(ను ఆయన సందర్శించారు. విద్యుత్ సరఫరా కోతలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. సబ్‌స్టేషన్‌లో ఉండాల్సిన లాగ్ బుక్ కనిపించకపోవడంపై హరీశ్ తీవ్రంగా స్పం దించారు.అనంతరం నిర్వహించిన సభ లో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌లో చేరికలతో మళ్లీ రాష్ట్రంలో పార్టీ గెలుస్తోందని ప్రజల్లో నమ్మకం వచ్చిందన్నారు. రాష్ట్రంలో రైతుల సమస్యలను పాలకులు గాలికి వదిలేశారన్నారు. కరెంట్‌లో వోల్టేజీతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుబంధు ఇచ్చి రైతులను కేసీఆర్ ఆదుకుంటే.. రైతుబంధు ఇవ్వకుండా రేవంత్ రెడ్డి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని మండిపడ్డారు. రైతు రుణమాఫీ, రైతుబీమా ఇవ్వడం లేద నీ, యూరియా కోసం రైతులకు అవస్థలు తప్పడం లేదని ఆరోపించారు.రాష్ట్రంలో రైతు రాజ్యం పోయి రేవంత్ రెడ్డి అరాచక పాలన వచ్చింది. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉచిత కరెం ట్ ఇవ్వడానికి ఇష్టం లేక కరెంట్ కోతలు పెడుతున్నారన్నారు. ఇంత జరుగుతున్నా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఎందుకు లాగ్ బుక్‌లు చూడడం లేదని ప్రశ్నించారు. కరెంటు కోతల వాస్తవాలు బయటపడతాయని సబ్ స్టేషన్‌లో లాగ్‌బుక్ మాయం చేశారని పేర్కొన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో 24 గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నామని చెపుతున్నప్పుడు సబ్‌స్టేషన్‌లో లాగ్ బుక్‌ను చూపించడానికి ఎందుకు భ యపడుతున్నారని ప్రశ్నించారు. స్థానిక కాం గ్రెస్ ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య, భువనగిరి ఎం పీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి డైవర్షన్ రాజకీయాలు మాని సబ్‌స్టేషన్లు సందర్శించి క్షేత్ర స్థాయి వాస్తవాలను తెలుసుకోవాలని సూ చించారు. రాష్ట్రంలో ఏర్పడిన కరువు ఎల్ నినో ప్రభావం వల్ల కాదని, కాంగ్రెస్ ప్రభు త్వ అసమర్థత వల్లే వచ్చిందని విమర్శించారు.

అక్షితరాణిది హత్యకేసులో ట్విస్ట్.. లెక్చరరే హంతకుడు!



గోదావరిఖని యువతిది ఆత్మహత్య కాదని తేల్చిన పోలీసులు
ప్రేమ పేరుతో దగ్గరై, విద్యార్థిని ప్రాణం తీసిన కాంట్రాక్ట్ లెక్చరర్
మరో వ్యక్తితో చనువుగా ఉందని కక్ష పెంచుకుని ఘాతుకం
ఆత్మహత్యగా చిత్రీకరించి, నేరాన్ని వేరొకరిపై నెట్టేందుకు విఫలయత్నం
సీసీ ఫుటేజ్, కాల్ డేటాతో నిందితుడు నవీన్‌ను అరెస్ట్ చేసిన అధికారులు

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

పాఠాలు చెప్పాల్సిన గురువే దారి తప్పాడు. ప్రేమ పేరుతో ఒక విద్యార్థినిని నమ్మించి, చివరికి ఆమె ప్రాణాలనే బలిగొన్నాడు. మరొకరితో చనువుగా ఉంటోందన్న అనుమానంతో పగ పెంచుకుని, గడ్డి మందు తాగించి హత్య చేశాడు. ఆ నేరాన్ని ఇంకొకరిపై నెట్టేందుకు ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశాడు. పెద్దపల్లి జిల్లా గోదావరిఖనిలో సంచలనం సృష్టించిన యువతి అక్షితరాణి ఆత్మహత్య కేసును పోలీసులు ఛేదించారు. ఇది ఆత్మహత్య కాదని, పక్కా ప్రణాళికతో చేసిన హత్య అని తేల్చారు. ఈ కేసుకు సంబంధించిన వివరాలను పెద్దపల్లి డీసీపీ రాంరెడ్డి ఆదివారం మీడియాకు వెల్లడించారు.

అసలేం జరిగిందంటే..

మంచిర్యాల జిల్లా నస్పూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో కాంట్రాక్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న జెట్టి నవీన్ (38), అదే కళాశాలలో చదువుతున్న తాండ్ర అక్షితరాణి (20)ని ప్రేమ పేరుతో లోబరుచుకున్నాడు. సుల్తానాబాద్ మండలం గర్రెపల్లికి చెందిన వీరిద్దరూ ఒకే ఊరు కావడంతో అక్షిత అతడిని నమ్మింది. అయితే, అప్పటికే నవీన్‌కు పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నారు. భార్యతో విభేదాల కారణంగా వేరుగా ఉంటున్నాడు. వీరి ప్రేమ వ్యవహారం ఊర్లో తెలియడంతో అక్షిత కుటుంబం గోదావరిఖనికి వలస వచ్చింది.డిప్లొమా పూర్తయ్యాక అక్షిత హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో ఇంజినీరింగ్‌లో చేరింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో శిక్షణ కోసం గోదావరిఖనిలోని సింగరేణి గనికి వచ్చింది. అక్కడ ఆమెకు మెంటార్‌గా వ్యవహరించిన ఓవర్‌మెన్ బొమ్మకంటి రవికుమార్‌తో పరిచయం ఏర్పడింది. ఈ క్రమంలో వారిద్దరూ చనువుగా ఉండటాన్ని నవీన్ సహించలేకపోయాడు. గతంలోనే అక్షిత ఫోన్‌లో ఆమెకు తెలియకుండా ఒక స్పై యాప్‌ను ఇన్‌స్టాల్ చేసిన నవీన్, ఆమె సంభాషణలను రహస్యంగా గమనించేవాడు. రవికుమార్‌తో ఆమె చనువుగా ఉండటాన్ని చూసి పగ పెంచుకున్నాడు.

హత్య చేసి.. ఆత్మహత్యగా చిత్రీకరణ

రవికుమార్‌పై కక్ష తీర్చుకోవాలని నిర్ణయించుకున్న నవీన్, మొదట అతడిపై లైంగిక వేధింపుల ఆరోపణలతో సింగరేణి అధికారులకు అక్షితతో ఫిర్యాదు చేయించాడు. కానీ, ఆధారాలు లేకపోవడంతో అధికారులు చర్యలు తీసుకోలేదు. ఈ క్రమంలోనే అక్షితను అంతమొందించి, ఆ నేరాన్ని రవికుమార్‌పై నెట్టేందుకు నవీన్ పథకం పన్నాడు.ఈ నెల 12న అక్షితను కలవాలని పిలిచి, తన కారులో ఎక్కించుకుని తిరుగుతూ గొడవపడ్డాడు. రవికుమార్‌పై కేసు పెట్టాలంటే ఆత్మహత్యాయత్నం చేయాలని నమ్మించి, బలవంతంగా ఆమెతో గడ్డి మందు తాగించాడు. ఆ తర్వాత, తన చావుకు రవికుమారే కారణమంటూ ఆమె చేత ఒక లేఖ రాయించి, దాన్ని ఫోన్‌లో ఫొటో తీశాడు. అక్షిత అపస్మారక స్థితికి చేరుకునే వరకు కారులోనే తిప్పి, ఆమె బతకదని నిర్ధారించుకున్నాక ఆమె తండ్రికి ఫోన్ చేశాడు. 'మీ అమ్మాయి ఆత్మహత్యాయత్నం చేసింది' అని చెప్పి, వారి ఇంటి వద్ద వదిలివెళ్లాడు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అక్షిత 13న మరణించింది.

సాంకేతిక ఆధారాలతో చిక్కిన నిందితుడు

మొదట అక్షిత ఫోన్‌లోని లేఖ ఆధారంగా రవికుమార్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు, దర్యాప్తులో భాగంగా సీసీ ఫుటేజీని పరిశీలించారు. అక్షిత, నవీన్ కారులో ఎక్కినట్లు గుర్తించారు. నవీన్ కాల్ డేటా, రికార్డింగ్‌లు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించగా అసలు నిజం బయటపడింది. నవీన్‌ను అదుపులోకి తీసుకుని విచారించగా, తానే హత్య చేసినట్లు అంగీకరించాడు. దీంతో ప్రధాన నిందితుడు నవీన్‌తో పాటు, ఆరోపణలు ఎదుర్కొంటున్న రవికుమార్‌ను కూడా పోలీసులు అరెస్ట్ చేశారు.

కొండచిలువను మింగిన కింగ్ కోబ్రా..

కర్ణాటకలో ఓ అరుదైన, ఆశ్చర్యకరమైన ఘటన చోటుచేసుకుంది. సుమారు 12 అడుగుల పొడవున్న ఓ భారీ కింగ్ కోబ్రా, ఒక కొండచిలువను సజీవంగా మింగుతూ కనిపించి కలకలం రేపింది. అయితే, దానిని పట్టుకునేందుకు ప్రయత్నించగా, మింగిన కొండచిలువను అది తిరిగి కక్కేసింది. ఈ అనూహ్య పరిణామం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.వివరాల్లోకి వెళితే, బెళ్తంగడి తాలూకా, తెంకకరందూరు గ్రామంలోని కాడింగ్ అనే ప్రాంతంలో సెప్టెంబర్ 11వ తేదీ శుక్రవారం సాయంత్రం ఈ ఘటన జరిగింది. ఓ ఇంటి పెరట్లో ఈ దృశ్యాన్ని గమనించిన స్థానిక కుటుంబం, వెంటనే స్నేక్ రెస్క్యూయర్ అశోక్‌కు సమాచారం అందించింది. అక్కడికి చేరుకున్న అశోక్, కింగ్ కోబ్రాను సురక్షితంగా తరలించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలోనే అది తన నోటి నుంచి కొండచిలువను బయటకు వదిలేసింది. అనంతరం కింగ్ కోబ్రాను జాగ్రత్తగా పట్టుకుని, సమీపంలోని అటవీ ప్రాంతంలో విడిచిపెట్టారు.ఈ ఘటన వింతగా అనిపించినా, కింగ్ కోబ్రాల విషయంలో ఇది అసాధారణం కాదని నిపుణులు చెబుతున్నారు. కింగ్ కోబ్రా శాస్త్రీయ నామం 'ఓఫియోఫాగస్ హన్నా'. దీనికి 'పాములను తినేది' అని అర్థం.


జనాభా లెక్కల్లో ఓబీసీ కాలమ్ చేర్చాలి..

జనాభా ప్రాతిపదికన న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలి
50 శాతం రిజర్వేషన్ పరిమితిపై కేంద్రం పునరాలోచించాలి
జాతీయ ఓబీసీ సదస్సులో దేశవ్యాప్త ఐక్య పోరాటానికి పిలుపు

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

2027లో నిర్వహించనున్న జనాభా లెక్కల్లో ఓబీసీలకు ప్రత్యేక కాలమ్ ఏర్పాటు చేసి దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కించినప్పుడే వారి జనాభా ప్రాతిపదికన న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. బీసీల హక్కుల సాధన కోసం దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల నుంచి ఒకే స్వరం వినిపించాలని ఆయన పిలుపునిచ్చారు. బేగంపేటలోని హోటల్ టూరిజం ప్లాజాలో ఆదివారం 'ఓబీసీ జనాభా గణనపై కేంద్ర ప్రభుత్వ విధాన నిర్ణయాలు.. ఓబీసీల తక్షణ బాధ్యతలు, భవిష్యత్ కార్యాచరణ' అంశంపై నిర్వహించిన జాతీయ ఓబీసీ సదస్సుకు మంత్రి పొన్నం ప్రభాకర్‌తో పాటు ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు, వివిధ రాష్ట్రాలకు చెందిన ఓబీసీ నాయకులు, సంఘాల ప్రతినిధులు, మేధావులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ గతంలో ఎంపీగా ఉన్న సమయంలో పార్లమెంట్‌లోని ఓబీసీ ఫోరం ఆధ్వర్యంలో సమస్యలపై పోరాడమన్నారు. ప్రస్తుతం తెలంగాణలో బీసీల సమస్యలపై కాంగ్రెస్‌తో పాటు ఇతర రాజకీయ పార్టీల నాయకులను కూడా కలుపుకొని ఐక్యంగా ముందుకు సాగుతున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా బీసీ నాయకులు, మేధావులను ఒకే వేదికపైకి తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్న జాజుల శ్రీనివాస్, ఆయన సహచరులకు ధన్యవాదాలు తెలిపారు.

తెలంగాణలో కులగణన పూర్తి



కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు తెలంగాణలో అధికారంలోకి వచ్చిన వెంటనే కులగణనకు చర్యలు ప్రారంభించామని పొన్నం ప్రభాకర్ తెలిపారు. వివిధ వర్గాల నిపుణులు, మేధావులు, భాగస్వాముల అభిప్రాయాలను తీసుకుని ప్రశ్నావళిని రూపొందించినట్లు చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇంటింటికీ వెళ్లి స్వీయ ప్రకటన ఆధారంగా వివరాలు సేకరించామని, ప్రతి 150 కుటుంబాలకు ఒక ప్రభుత్వ ఉద్యోగిని కేటాయించి కులగణన ప్రక్రియను పూర్తి చేశామని వివరించారు. కేబినెట్‌లో చర్చించిన అనంతరం శాసనసభలో తీర్మానం చేసి, రాజ్యాంగపరమైన ప్రక్రియలను పూర్తి చేసి, గవర్నర్ ఆమోదంతో నివేదికను కేంద్ర ప్రభుత్వానికి పంపించామని చెప్పారు. దేశంలో వివిధ వర్గాల జనాభా లెక్కలు నిర్వహిస్తున్నప్పటికీ బీసీల జనాభాను లెక్కించేందుకు ఎందుకు వెనుకడుగు వేస్తున్నారో అర్థం కావడం లేదని మంత్రి ప్రశ్నించారు. "బీసీలు ఎంతమంది ఉన్నారో లెక్కించకుండా వారికి ఎంత వాటా ఇవ్వాలో ఎలా నిర్ణయిస్తాం?" అని అన్నారు. కులగణన కేవలం జనాభా లెక్కల ప్రక్రియ కాదని, సామాజిక న్యాయానికి పునాది అని స్పష్టం చేశారు.

50 శాతం పరిమితిపై పునరాలోచన

ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. అయితే బీసీల జనాభా ప్రాతిపదికన న్యాయం జరిగే విషయంలో 50 శాతం రిజర్వేషన్ పరిమితి అడ్డంకిగా మారకూడదన్నారు. బీసీల జనాభా, వారి సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులకు సంబంధించిన సమగ్ర డేటా ఆధారంగా రిజర్వేషన్లపై నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. "బీసీల జనాభాను శాస్త్రీయంగా లెక్కించాలి. జనాభాకు అనుగుణంగా న్యాయమైన ప్రాతినిధ్యం కల్పించాలి. 2027 జనాభా లెక్కల్లో ఓబీసీ కాలమ్‌ను చేర్చాలి. బీసీల హక్కుల కోసం దేశవ్యాప్తంగా ఐక్యంగా పోరాడాలి" అని మంత్రి పిలుపునిచ్చారు. తెలంగాణలో కులగణన పూర్తి చేసి దేశానికి ఒక మార్గాన్ని చూపించామని, ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించే దిశగా చర్యలు తీసుకోవాలని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు.

హైదరాబాద్‌లో లిఫ్ట్ ప్రమాదం నుంచి వ్యక్తిని కాపాడిన హైడ్రా



మూసాపేటలో లిఫ్ట్ ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తి
లిఫ్టుకు, గోడకు మధ్య వేలాడుతూ నరకయాతన
గంటన్నర పాటు శ్రమించి కాపాడిన డీఆర్ఎఫ్ బృందం
గోడను పగలగొట్టి, హైడ్రాలిక్ కట్టర్‌తో రెస్క్యూ ఆపరేషన్
క్షతగాత్రుడి కాలికి ఫ్రాక్చర్.. ఆసుపత్రికి తరలింపు

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం

హైదరాబాద్ నగరంలోని మూసాపేటలో ఆదివారం ఓ భవనంలో ప్రమాదం జరిగింది. లిఫ్టుకు, గోడకు మధ్య ఇరుక్కుని ప్రాణాపాయ స్థితిలో వేలాడుతున్న ఓ వ్యక్తిని హైడ్రా డీఆర్ఎఫ్ బృందం గంటన్నర పాటు శ్రమించి సురక్షితంగా కాపాడింది. ఈ ఘటన మూసాపేట అంజనేయ నగర్‌లోని ఓ మూడంతస్తుల భవనంలో చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళితే, బాధితుడు మురళి (40), తన భార్యతో కలిసి గ్రౌండ్ ఫ్లోర్ నుంచి రెండో అంతస్తుకు లిఫ్ట్‌లో వెళ్లారు. రెండో అంతస్తు రాగానే ఆయన బయటకు అడుగుపెట్టే ప్రయత్నం చేశారు. అదే సమయంలో మూడో అంతస్తులో ఉన్న ఎవరో లిఫ్ట్ బటన్ నొక్కడంతో అది ఒక్కసారిగా పైకి కదిలింది. దీంతో మురళి ఒక కాలు రెండో అంతస్తులో, మరో కాలు లిఫ్ట్‌లో ఉండగానే ప్రమాదం జరిగింది. ఆయన శరీరం లిఫ్టకు, గోడకు మధ్య ఇరుక్కుపోగా, కాలు గ్రిల్స్‌లో చిక్కుకుని వేలాడసాగారు.లిఫ్ట్‌లోనే ఉన్న ఆయన భార్య కేకలు వేయడంతో అపార్ట్‌మెంట్ వాసులు వచ్చి కాపాడేందుకు విఫలయత్నం చేశారు. అనంతరం ఉదయం 9:15 గంటలకు హైడ్రా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించారు. వెంటనే కూకట్‌పల్లిలోని డీఆర్ఎఫ్ బృందం మార్షల్ జేడీవీ ప్రసాద్ నేతృత్వంలో 9:30 గంటలకే ఘటనా స్థలానికి చేరుకుంది. పరిస్థితి తీవ్రతను గమనించి సనత్‌నగర్ ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. వారు తెచ్చిన హైడ్రాలిక్ కట్టర్ సాయంతో, లిఫ్ట్ పక్కన ఉన్న గోడను బద్దలుకొట్టి సుమారు గంటన్నర పాటు శ్రమించి మురళిని బయటకు తీశారు. ఉదయం 10:50 గంటలకు ఈ ఆపరేషన్ పూర్తయింది.భవనంలోని పాత గ్రిల్స్ లిఫ్ట్ సెన్సార్లు సరిగా పనిచేయకపోవడమే ఈ దుర్ఘటనకు కారణంగా తెలుస్తోంది. ఈ ప్రమాదంలో మురళి కాలు లిఫ్టకు, గోడకు మధ్య నలిగిపోవడంతో ఫ్రాక్చర్ అయింది. సిబ్బంది అతడిని వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. సకాలంలో స్పందించి ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడిన హైడ్రా డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బందిని స్థానికులు అభినందించారు.

టికెట్ రేట్ల పెంపునకు తెలంగాణ సర్కారు గ్రీన్ సిగ్నల్

నాని 'ది ప్యారడైజ్' చిత్రానికి తెలంగాణ సర్కార్ ప్రత్యేక అనుమతులు
టికెట్ ధరల పెంపు, రోజుకు ఐదు షోలకు గ్రీన్ సిగ్నల్
విడుదలకు ఒక రోజు ముందే ప్రత్యేక ప్రీమియర్ షో
నిర్మాతలు రూ.1 కోటి విరాళం ఇవ్వాలనే షరతు విధింపు

హదరాబాద్, సామాన్యుడి అస్త్రం


నేచురల్ స్టార్ నాని కథానాయకుడిగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ థ్రిల్లర్ చిత్రం 'ది ప్యారడైజ్'కు తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక అనుమతులు



మంజూరు చేసింది. సినిమా టికెట్ ధరల పెంపు, అదనపు షోలు, స్పెషల్ ప్రీమియర్ ప్రదర్శనకు గ్రీన్ సిగ్నల్ ఇస్తూ ఆదివారం అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సినిమాస్ పతాకంపై నిర్మిస్తున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు నెలకొన్నాయి.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం, ఈ నెల 24న సినిమా థియేటర్లలో విడుదల కానుండగా, ఒక రోజు ముందే అంటే సెప్టెంబర్ 23న సాయంత్రం 6:30 గంటలకు స్పెషల్ ప్రీమియర్ షో ప్రదర్శించేందుకు అనుమతి ఇచ్చింది. ఈ ప్రత్యేక షోకు టికెట్ ధరను జీఎస్టీతో కలిపి రూ. 500గా నిర్ణయించారు. అలాగే సెప్టెంబర్ 24 నుంచి తెలంగాణ వ్యాప్తంగా థియేటర్లలో రోజుకు ఐదు షోలు ప్రదర్శించుకునేందుకు వెసులుబాటు కల్పించారు.మొదటి 10 రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునేందుకు కూడా ప్రభుత్వం అనుమతించింది. మల్టీప్లెక్స్‌లు, స్పెషల్ థియేటర్లలో సెప్టెంబర్ 24 నుంచి 27 వరకు రూ. 95, ఆ తర్వాత సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 3 వరకు రూ. 45 అదనంగా వసూలు చేసుకోవచ్చు. అదేవిధంగా, సింగిల్ స్క్రీన్లలో మొదటి నాలుగు రోజులు రూ. 48, తర్వాతి ఆరు రోజులు రూ. 23 చొప్పున అదనంగా పెంచుకోవడానికి అనుమతించారు.అయితే, ఈ అనుమతులకు ప్రభుత్వం కొన్ని షరతులు విధించింది.

బెంగళూరులో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం.. హాజరైన సీఎం చంద్రబాబు

వైట్‌ఫీల్డ్‌లో 'ది ఎర్త్ సెంటర్' ప్రారంభోత్సవం
9 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో అత్యాధునిక కమర్షియల్ భవనం
ప్రకృతితో మమేకమయ్యేలా 'బయోఫిలిక్ డిజైన్'తో ప్రత్యేక నిర్మాణం
కార్యక్రమం అనంతరం బెంగళూరులోనే బస చేసి, రేపు కుప్పం పర్యటనకు వెళ్లనున్న సీఎం



అమరావతి,సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం బెంగళూరులో పర్యటించారు. నగరంలోని ప్రముఖ ఐటీ హబ్ అయిన వైట్‌ఫీల్డ్‌లో అత్యాధునికంగా నిర్మించిన 'ది ఎర్త్ సెంటర్' అనే కమర్షియల్ ఆఫీస్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి కర్ణాటక సీఎం డీకే శివకుమార్ కూడా హాజరయ్యారు. ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ 'విస్తా స్పేసెస్' ఈ ప్రాజెక్టును అభివృద్ధి చేసింది.ఈ భవనాన్ని సుమారు 9 లక్షల చదరపు అడుగుల భారీ విస్తీర్ణంలో, 2 బేస్‌మెంట్లు, గ్రౌండ్ ఫ్లోర్‌తో కలిపి మొత్తం 8 అంతస్తులతో నిర్మించారు. కేవలం కాంక్రీట్ భవనంలా కాకుండా, ఉద్యోగులు ప్రకృతితో మమేకమై పనిచేసే వాతావరణాన్ని కల్పించేలా 'బయోఫిలిక్ డిజైన్' శైలిలో దీన్ని రూపొందించడం ప్రధాన ఆకర్షణ. ఈ డిజైన్ ఉద్యోగుల మానసిక ఉల్లాసాన్ని, ఉత్పాదకతను పెంచడానికి దోహదపడుతుంది. వీవర్క్, ది ఎగ్జిక్యూటివ్ సెంటర్ వంటి ప్రముఖ ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ ప్రొవైడర్లు ఇక్కడ తమ ప్రీమియం ఆఫీస్ సేవలను అందిస్తున్నాయి.వైట్‌ఫీల్డ్‌లోని కేఐఏడీబీ ఎక్స్‌పోర్ట్ ప్రమోషన్ ఇండస్ట్రియల్ ఏరియాలో జరిగిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం, సీఎం చంద్రబాబు ఈ రాత్రికి బెంగళూరులోనే బస చేయనున్నారు. సోమవారం ఉదయం ఇక్కడి నుంచే నేరుగా తన సొంత నియోజకవర్గమైన కుప్పం పర్యటనకు ఆయన బయలుదేరి వెళతారు.

ఏపీలో దసరా సెలవులు.. ఆ రెండ్రోజులు భలే కలిసొచ్చాయి!




ఏపీలో విద్యార్థులకు కలిసొచ్చిన దసరా సెలవులు
అక్టోబరు 12 నుంచి 21 వరకు సెలవులు
అక్టోబర్ 10 రెండో శనివారం, 11వ తేదీ ఆదివారం
దాంతో ముందే ప్రారంభం కానున్న సెలవుల సందడి

అమరావతి,సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్‌లోని పాఠశాల విద్యార్థులకు ఈ ఏడాది దసరా సెలవులు కాస్త ముందుగానే రానున్నాయి. అధికారికంగా ప్రకటించిన సెలవులకు ముందు రెండో శనివారం, ఆదివారం రావడంతో విద్యార్థులకు మరో రెండు రోజులు అదనంగా కలిసొచ్చాయి. దీంతో పండగ వాతావరణం ముందుగానే మొదలుకానుంది.రాష్ట్ర విద్యాశాఖ అకడమిక్ క్యాలెండర్ ప్రకారం, 2026 సంవత్సరానికి గాను అక్టోబర్ 12 నుంచి 21వ తేదీ వరకు, మొత్తం 10 రోజుల పాటు దసరా సెలవులను అధికారికంగా ప్రకటించారు. అయితే, దీనికి ముందుగా అక్టోబర్ 10వ తేదీ రెండో శనివారం, 11వ తేదీ ఆదివారం కావడంతో ఆ రెండు రోజులు కూడా సెలవుల్లో కలిసిపోయాయి. ఫలితంగా విద్యార్థులకు అక్టోబర్ 10 నుంచే సెలవులు ప్రారంభం కానున్నాయి. మొత్తం మీద 12 రోజుల పాటు విరామం లభించనుంది. సెలవుల అనంతరం అక్టోబర్ 22వ తేదీన పాఠశాలలు తిరిగి తెరుచుకుంటాయి.ఇక పొరుగు రాష్ట్రమైన తెలంగాణ విషయానికొస్తే, అక్కడ విద్యార్థులకు 13 రోజుల పాటు దసరా సెలవులు లభించనున్నాయి. అక్టోబర్ 10 నుంచి అక్టోబర్ 22 వరకు పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. తిరిగి అక్టోబర్ 23న తరగతులు ప్రారంభమవుతాయి. ఈ ఏడాది విజయదశమి పండగ అక్టోబర్ 20వ తేదీ, మంగళవారం వచ్చింది. తెలంగాణలో అత్యంత వైభవంగా జరుపుకునే బతుకమ్మ ఉత్సవాలు అక్టోబర్ 18న జరగనున్నాయి.

సత్యప్రసాద్ వాంగ్మూలంపై జగన్ ఎందుకు స్పందించడంలేదు?: మంత్రి పార్థసారథి

గత వైసీపీ ప్రభుత్వ మద్యం విధానంపై మంత్రి పార్థసారథి తీవ్ర ఆరోపణలు
రూ.3,200 కోట్ల మద్యం కుంభకోణంపై జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్
కీలక అధికారి సత్యప్రసాద్ వాంగ్మూలంతో కుంభకోణం గుట్టు రట్టయిందని వెల్లడి
డిజిటల్ చెల్లింపులు రద్దు చేసి నగదు లావాదేవీలతో భారీ అవినీతికి పాల్పడ్డారని ఆరోపణ
కూటమి ప్రభుత్వంలో పారదర్శక మద్యం విధానం అమలు చేస్తున్నామని స్పష్టీకరణ



అమరావతి,సామాన్యుడి అస్త్రం

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అమలు చేసిన మద్యం విధానం ద్వారా వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడటమే కాకుండా, విషతుల్యమైన మద్యాన్ని అమ్మి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడారని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తీవ్రంగా ధ్వజమెత్తారు. రూ.3,200 కోట్ల భారీ మద్యం కుంభకోణంపై, కీలక అధికారి సత్యప్రసాద్ వెల్లడించిన అంశాలపై గొడ్డలి పార్టీ అధ్యక్షుడు జగన్ రెడ్డి ప్రజలకు సమాధానం చెప్పి తీరాలని ఆయన డిమాండ్ చేశారు. ఆదివారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి పార్థసారథి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ అక్రమాలను, దోపిడీని తీవ్రంగా ఎండగట్టారు. వైసీపీ పాలనలో వ్యవస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి, అధికారులను ఒత్తిడికి గురిచేసి అక్రమాలకు పాల్పడ్డారని ఆయన ఆరోపించారు.

రూ.3,200 కోట్ల ముడుపులు ఎవరివి?

మద్యం విధానంలో భాగంగా సుమారు రూ.3,200 కోట్ల ముడుపులు చేతులు మారినట్లు రాష్ట్ర బేవరేజెస్ కార్పొరేషన్ మాజీ ఓఎస్డీ సత్యప్రసాద్ కోర్టుకు ఇచ్చిన వాంగ్మూలంలో పేర్కొన్నారని మంత్రి పార్థసారథి తెలిపారు. ఈ కుంభకోణానికి సంబంధించిన కీలక నిర్ణయాలన్నీ అప్పటి ముఖ్యమంత్రి నివాసమైన తాడేపల్లి ప్యాలెస్‌లోనే తీసుకున్నారని సత్యప్రసాద్ చెప్పినట్లు వార్తలు వస్తున్నాయని తెలిపారు. "నిజాలు బయటపెడుతున్న సత్యప్రసాద్ మానసిక స్థితి సరిగా లేదని వైసీపీ నేతలు ప్రచారం చేస్తున్నారు. తమకు అనుకూలంగా ఉన్నప్పుడు ఆయన ఆరోగ్యంగా ఉన్నట్లేనా? ఇప్పుడు వాస్తవాలు వెల్లడిస్తుండటంతోనే ఇలాంటి ముద్ర వేసి అసలు అంశాన్ని పక్కదారి పట్టించాలని చూస్తున్నారు. ఈ తప్పుడు ప్రచారాలు ఆపి, ఆరోపణలకు సూటిగా సమాధానం చెప్పాలి" అని పార్థసారథి సవాల్ విసిరారు.

నగదు లావాదేవీల వెనుక మర్మమేంటి?

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో డిజిటల్ చెల్లింపులను పూర్తిగా తొలగించి, కేవలం నగదు లావాదేవీలనే ప్రోత్సహించడం వెనుక ఉన్న మర్మమేంటని పార్థసారథి ప్రశ్నించారు. "కోట్లాది రూపాయల మద్యం విక్రయాలు నగదు రూపంలోనే జరగాలని ఎందుకు ఆదేశించారు? ఆ డబ్బు ఎక్కడికి వెళ్లింది? కొత్త బ్రాండ్లను ప్రవేశపెట్టడం, మాన్యువల్ విధానంలో ఆర్డర్లు కేటాయించడం వంటి చర్యలన్నీ అవినీతి కోసమే" అని ఆయన ఆరోపించారు. మద్యం రవాణా కాంట్రాక్టులను కూడా జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర స్థాయికి కేంద్రీకరించి, రేట్లు పెంచి తమ అనుయాయులకు కట్టబెట్టారని విమర్శించారు. మద్యం దుకాణాల్లో సిబ్బంది నియామకాలు, వారి జీతాల చెల్లింపుల్లోనూ భారీగా అక్రమాలు జరిగాయని ఆయన పేర్కొన్నారు.

ప్రజల ఆరోగ్యంతో చెలగాటం

2019 ఎన్నికలకు ముందు సంపూర్ణ మద్య నిషేధం అని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నాసిరకం మద్యాన్ని అమ్మి ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టారని పార్థసారథి మండిపడ్డారు. కల్తీ మద్యం తాగి ఎంతోమంది అనారోగ్యం పాలయ్యారని, ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తమ కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాల్లో నాణ్యతకు, పారదర్శకతకు పెద్దపీట వేస్తోందని తెలిపారు.

ఏపీలో ప్రభుత్వ ఉద్యోగులకు శుభవార్త..

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్
ఆరేళ్ల సర్వీసు పూర్తి చేసుకున్న వారికి ఈ ప్రయోజనం వర్తింపు
రాష్ట్రవ్యాప్తంగా సుమారు 1.30 లక్షల మంది సిబ్బందికి లబ్ధి
11వ పీఆర్సీ సిఫార్సుల మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ
ఇది ప్రమోషన్ కాదు, ఆర్థిక ప్రయోజనం మాత్రమేనని స్పష్టీకరణ

అమరావతి,సామాన్యుడి అస్త్రం

లఆంధ్రప్రదేశ్‌లోని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఆరేళ్ల సర్వీసును పూర్తి చేసుకున్న ఉద్యోగులకు ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్ (ఏఏఏ) కింద స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్ (గ్రా+ఏ) మంజూరు చేస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆర్థిక శాఖ అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో రాష్ట్రవ్యాప్తంగా 15,000కు పైగా ఉన్న స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సుమారు 1.30 లక్షల మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారు. ముఖ్యంగా 2019, 2020 సంవత్సరాల్లో తొలి విడతలో నియమితులైన ఉద్యోగులకు ఈ స్కేల్ ప్రయోజనం చేకూరనుంది. 11వ వేతన సవరణ కమిషన్ (గ్రా=జ) చేసిన సిఫార్సులను అనుసరించి ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని అమలు చేస్తోంది.అయితే, ఇది రెగ్యులర్ పదోన్నతి కాదని, కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమేనని అధికారులు స్పష్టం చేశారు. ఒకే పోస్టులో ఎక్కువ కాలం పనిచేస్తున్న ఉద్యోగులకు ఆర్థికంగా భరోసా కల్పించేందుకు ఉద్దేశించిన ఆటోమేటిక్ అడ్వాన్స్‌మెంట్ స్కీమ్‌లో భాగంగానే ఈ స్పెషల్ గ్రేడ్ స్కేల్‌ను అందిస్తున్నట్లు తెలిపారు. ఏఏఎస్ నిబంధనల ప్రకారం, ఉద్యోగులకు 6 ఏళ్ల సర్వీసుకు స్పెషల్ గ్రేడ్, ఆ తర్వాత 12, 18, 24 ఏళ్ల సర్వీసుకు తదుపరి ఆర్థిక ప్రయోజనాలు లభిస్తాయి.తాజా ఉత్తర్వుల నేపథ్యంలో, అర్హులైన ఉద్యోగుల సర్వీస్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి, వారికి స్పెషల్ గ్రేడ్ పోస్ట్ స్కేల్‌ను వెంటనే మంజూరు చేయాలని సంబంధిత శాఖల అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. ప్రభుత్వ నిర్ణయంపై సచివాలయ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఏపీలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు..

రాష్ట్రంలో 9 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం
సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా జయలక్ష్మికి నియామకం
ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఐజీగా కాంతి రాణాకు పోస్టింగ్
విశాల్ గున్నీకి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు
పల్నాడు, మార్కాపురం, పోలవరం జిల్లాలకు కొత్త ఎస్పీలు
తక్షణమే బాధ్యతలు చేపట్టాలని ప్రభుత్వ ఆదేశాలు

అమరావతి,సామాన్యుడి అస్త్రం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు 9 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో పలు కీలక విభాగాలతో పాటు, మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించారు.వివరాల్లోకి వెళితే, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్పీఎఫ్) డీజీగా ఉన్న సి.హెచ్. త్రివిక్రమ్ వర్మను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఎఫ్ఎస్ఎల్) డైరెక్టర్‌గా నియమించారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్‌గా పనిచేస్తున్న జయలక్ష్మిని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా బదిలీ చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్ల ఐజీగా ఉన్న బి. రాజకుమారిని రైల్వేస్ ఐజీగా నియమిస్తూ, సీఐడీ మహిళా భద్రత విభాగం ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కొన్న ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ సస్పెండైన సంగతి తెలిసిందే. ఇటీవలే ప్రభుత్వం వీరిద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేసింది. దాంతో వారి పోస్టింగ్ కు మార్గం సుగమం అయింది. ఈ క్రమంలో ఈ ఇద్దరు అధికారులకు తాజా బదిలీల్లో పోస్టింగ్ ఇచ్చారు. కొంతకాలంగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కాంతి రాణాకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ ఐజీగా కీలక బాధ్యతలు ఇచ్చారు. అదేవిధంగా, పోస్టింగ్ కోసం వేచి ఉన్న మరో అధికారి విశాల్ గున్నీకి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు అప్పగించారు.

గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్న బాబుజీ అట్టాడను టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీ చేశారు.

జిల్లా స్థాయిల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పోలవరం ఓఎస్డీగా ఉన్న పంకజ్ కుమార్ మీనాను మార్కాపురం జిల్లా ఎస్పీగా నియమించారు. సీఐడీ ఎస్పీగా ఉన్న కె. చక్రవర్తిని పోలవరం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఇక సీఎం సెక్యూరిటీ గ్రూప్ (సీఎంఎస్‌జీ) ఎస్పీగా ఉన్న జగదీశ్ అడహల్లికి పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పరిపాలనా సౌలభ్యం, శాఖల బలోపేతం లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

వైసీపీ తప్పుడు ప్రచారం చేస్తోంది.. నమ్మొద్దు: డీఎస్సీ స్పోర్ట్స్ కోటా టీచర్ల విజ్ఞప్తి



విజయవాడలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించిన 370 మంది ఉపాధ్యాయులు

ప్రతిభ, పతకాలతోనే ఉద్యోగాలు సాధించామని స్పష్టీకరణ

స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచిన సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు

గాయాల కన్నా ఆరోపణలే ఎక్కువ బాధిస్తున్నాయని ఉపాధ్యాయుల ఆవేదన

అమరావతి,సామాన్యుడి అస్త్రం

మెగా డీఎస్సీ ద్వారా స్పోర్ట్స్ కోటాలో ఎంపికైన తమ నియామకాలపై వైసీపీ ఉద్దేశపూర్వకంగా దుష్ప్రచారం చేస్తోందని పలువురు ఉపాధ్యాయులు తీవ్రంగా ఖండించారు. తమ ఆత్మగౌరవాన్ని దెబ్బతీసేలా అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు విజయవాడలో సుమారు 370 మంది స్పోర్ట్స్ కోటా ఉపాధ్యాయులు ఆదివారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించి, తమ నిరసనను తెలియజేశారు.ఈ సమావేశంలో టీచర్లు “అబద్ధాలు వద్దు – ఆత్మగౌరవం ముద్దు” అంటూ నినాదాలు చేశారు. తాము ఎంతో కష్టపడి, క్రీడల్లో పతకాలు సాధించి మెరిట్ ఆధారంగానే ఉద్యోగాలు పొందామని స్పష్టం చేశారు. మెగా డీఎస్సీ ప్రక్రియను అప్రతిష్ఠపాలు చేసే ప్రయత్నాలను సహించబోమని హెచ్చరించారు. ఈ సందర్భంగా, స్పోర్ట్స్ కోటాను 3 శాతానికి పెంచి తమకు న్యాయం చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వారు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు మాట్లాడుతూ భావోద్వేగానికి గురయ్యారు. “కొంతమంది కావాలనే మాపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైసీపీ నేతలు అనుకునే గాంబ్లింగ్, పేకాట స్పోర్ట్స్ కోటాలో ఉండవు. బ్రిడ్జి గేమ్ గురించి తెలియక పేకాట అని తప్పుగా ప్రచారం చేస్తున్నారు. మాపైకి రాజకీయాలు నెట్టవద్దు. ఆటల్లో తగిలిన శారీరక గాయాల కన్నా, వారి మాటలు మమ్మల్ని మానసికంగా ఎక్కువ బాధిస్తున్నాయి” అని వారు ఆవేదన వ్యక్తం చేశారు. “ఆరోపణలు చేస్తున్న ఛానళ్లు, నాయకులు కళ్లు తెరిచి మా సర్టిఫికెట్లు చూడాలి. ప్రతిభ ఉంటే ఒకే కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలు రాకూడదా?” అని వారు ప్రశ్నించారు. వైసీపీ చేస్తున్న నిరాధార ఆరోపణలను ప్రజలు నమ్మవద్దని వారు విజ్ఞప్తి చేశారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో రథం లాగిన బాలకృష్ణ అర్ధాంగి వసుంధర



తిరుమల బ్రహ్మోత్సవాల్లో వైభవంగా స్వర్ణరథోత్సవం

శ్రీదేవి, భూదేవి సమేతంగా విహరించిన మలయప్ప స్వామి

రథం లాగి భక్తి చాటుకున్న బాలకృష్ణ అర్ధాంగి వసుంధర

వేడుకలో పాల్గొన్న ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయిన ఫొటోలు

అమరావతి,సామాన్యుడి అస్త్రం

కలియుగ వైకుంఠం తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు అత్యంత వైభవంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ఆరో రోజైన ఆదివారం ఉదయం స్వర్ణరథోత్సవం కనులపండువగా జరిగింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీ మలయప్ప స్వామివారు సర్వాలంకార భూషితులై స్వర్ణరథంపై తిరుమాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను అనుగ్రహించారు.బంగారు వర్ణంతో దేదీప్యమానంగా వెలిగిపోతున్న రథంపై కొలువుదీరిన స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గోవింద నామస్మరణలతో తిరుమాడ వీధులు మార్మోగాయి. భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు సమర్పిస్తూ స్వామివారిని దర్శించుకుని తన్మయత్వం చెందారు.ఈ స్వర్ణరథోత్సవంలో ప్రముఖ సినీ నటుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ అర్ధాంగి వసుంధర ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఆమె స్వయంగా రథం తాడును పట్టుకుని లాగి స్వామివారిపై తనకున్న భక్తిని చాటుకున్నారు. ఈ వేడుకలో టీటీడీ బోర్డు సభ్యురాలు, కోవూరు శాసనసభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కూడా పాల్గొన్నారు. వసుంధర రథాన్ని లాగుతున్న ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో సందడి చేస్తున్నాయి.

క్లాస్‌రూం నుంచే సమాజ మార్పు సాధ్యం: మంత్రి నారా లోకేశ్

కాకినాడలో చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ‘భారతీయం’ కార్యక్రమం

హాజరైన ఏపీ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్

సాంకేతికతకు భారతీయ విలువలు జోడించి ప్రపంచ విజేతలుగా ఎదగాలని పిలుపు

ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే ఏపీ విద్యావ్యవస్థ దేశంలోనే నెం.1 అవుతుందని వ్యాఖ్యలు

త్యాగధనుల బాటలో పయనించి దేశానికి గర్వకారణంగా నిలవాలని విద్యార్థులకు సూచన

అమరావతి,సామాన్యుడి అస్త్రం

సాంకేతికతకు భారతీయ విలువలను జోడించడం ద్వారా విద్యార్థులు ప్రపంచ విజేతలుగా ఎదగాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ కృషికి నైతిక విలువలు తోడైతే ఆంధ్రప్రదేశ్ విద్యావ్యవస్థ దేశంలోనే నెంబర్ వన్ గా రూపుదిద్దుకుంటుందని ఆయన



ధీమా వ్యక్తం చేశారు.కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాల ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల విద్యాశాఖ, ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ‘భారతీయం’ పేరుతో నిర్వహించిన ఈ దేశభక్తి కార్యక్రమానికి లోకేశ్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, “క్లాస్‌రూం నుంచే సమాజంలో మార్పు సాధ్యం. అందుకే నేను విద్యాశాఖను ఎంచుకున్నాను. దేశభక్తి, నైతిక విలువలే మన కుటుంబ వ్యవస్థకు పునాది” అని అన్నారు. త్యాగధనులే మనకు మార్గదర్శకులని, వారి బాటలో పయనించి ఉన్నతంగా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. విలువలతో కూడిన విద్యను అభ్యసించి తల్లిదండ్రులకు, దేశానికి గర్వకారణంగా నిలవాలని లోకేశ్ మార్గనిర్దేశం చేశారు.

స్వాతంత్ర్య సంగ్రామం గత చరిత్ర కాదు.. మన వారసత్వ సంపద



త్యాగధనుల చరిత్రను తెలుసుకున్నప్పుడే దేశభక్తి పెరుగుతుందని వెల్లడి

భారతీయం అనే పదం స్వాతంత్ర్య ఉద్యమ సమయంలోనే పుట్టిందని గుర్తుచేసిన చాగంటి

దేశభక్తి ఉన్న లోకేశ్ విద్యామంత్రి కావడం విద్యార్థుల అదృష్టమని ప్రశంస

స్వాతంత్ర్య సమరయోధుల జీవిత చరిత్రలను పిల్లలకు బహుమతిగా ఇవ్వాలని పిలుపు

అమరావతి,సామాన్యుడి అస్త్రం

దేశ స్వాతంత్ర్య సంగ్రామం అనేది కేవలం గడిచిపోయిన చరిత్ర కాదని, అది తరతరాలకు అందించాల్సిన మనందరి వారసత్వ సంపద అని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త, రాష్ట్ర ప్రభుత్వ నైతిక విలువల సలహాదారు చాగంటి కోటేశ్వరరావు అన్నారు. ఎందరో మహనీయుల త్యాగాల పునాదులపై నిర్మితమైన స్వేచ్ఛ విలువను ప్రతి ఒక్కరూ గుర్తించి, దాన్ని కాపాడుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. కాకినాడ రూరల్ తిమ్మాపురంలోని ఆకుండి లక్ష్మీ స్మారక గోశాలలో విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే లక్ష్యంతో నిర్వహించిన ‘భారతీయం’ కార్యక్రమంలో ఆయన ముఖ్యవక్తగా పాల్గొని ప్రసంగించారు.ఈ సందర్భంగా చాగంటి మాట్లాడుతూ.. “ఒక తండ్రి తన జీవితాంతం కష్టపడి ఆస్తులు సంపాదించి పిల్లలకు ఇస్తాడు. ఆ సంపద వెనుక తన శ్రమ, త్యాగం ఉన్నాయని పిల్లలు గ్రహించాలని కోరుకుంటాడు. లేదంటే ఆ సంపదను నిలబెట్టుకోలేరని భయపడతాడు. మన స్వాతంత్ర్యం కూడా అలాంటిదే. ఎందరో మహనీయులు తమ ప్రాణాలను పణంగా పెట్టి మనకు ఈ స్వేచ్ఛను అందించారు. కేవలం ఆ స్వేచ్ఛను అనుభవించడమే కాదు, దాని వెనుక ఉన్న త్యాగాల విలువను అర్థం చేసుకుని, దాన్ని కాపాడుకోవడం మనందరి బాధ్యత” అని ఉద్బోధించారు.

‘భారతీయం’ స్వాతంత్ర్య ఉద్యమ సమయంలో పుట్టిన పదం

“భారతీయం అనే మాట ఇప్పుడు పుట్టింది కాదు. స్వాతంత్ర్య పోరాట సమయంలో, సైమన్ కమిషన్‌కు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా ఉద్యమం జరిగినప్పుడు పుట్టింది. ‘భారతదేశం గురించి నిర్ణయాలు భారతీయులే తీసుకోవాలి’, ‘సైమన్ గో బ్యాక్’ అనే నినాదాలతో ప్రజలు ఉద్యమించారు. భారతీయం లేని సైమన్ మాకు వద్దంటూ నినదించారు. అప్పుడే ఈ పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. ఇలాంటి విషయాలను మనం నిరంతరం చర్చించుకుంటూ ఉండాలి. అప్పుడే పిల్లలకు మన చరిత్రపై అవగాహన, దేశంపై భక్తి కలుగుతాయి. లేదంటే నైతిక విలువలు నశించిపోతాయి” అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

త్యాగాల స్ఫూర్తితో దేశభక్తిని నింపుకోవాలి

స్వాతంత్ర్య సమరయోధులు అనుభవించిన కష్టాలను వివరిస్తూ, “అండమాన్‌లోని కాలాపాని జైలు గురించి చదివితే వారి త్యాగాలు మనసును కదిలిస్తాయి. ఇరుకైన గదుల్లో వారు అనుభవించిన నరకం ఊహకు అందనిది. టంగుటూరి ప్రకాశం పంతులు గారు బ్రిటిష్ పోలీసుల తుపాకీకి గుండెను అడ్డుపెట్టి ‘ఆంధ్రకేసరి’ అయ్యారు. పొట్టి శ్రీరాములు వంటి మహనీయుల త్యాగాలను స్మరించుకోవాలి. ఘంటసాల వెంకటేశ్వరరావు గారు కేవలం గొప్ప గాయకుడే కాదు, స్వాతంత్ర్య ఉద్యమంలోనూ పాల్గొన్నారు. పొట్టి శ్రీరాములు గారి అంతిమయాత్రలో దేశభక్తి గీతాలు పాడుతూ చివరి వరకు నడిచారు. ఇలాంటి మహనీయుల జీవిత చరిత్రలను పిల్లలకు చదివించాలి. మనకు దేవాలయాలు ఎంత పవిత్రమో, స్వాతంత్ర్య సమరయోధులు నడయాడిన ప్రదేశాలు, వారు బందీలుగా ఉన్న జైళ్లు కూడా అంతే పవిత్రమైనవి. వాటిని సందర్శించడం ద్వారా మన చరిత్రను తెలుసుకుని, దేశభక్తిని పెంపొందించుకోవచ్చు” అని చాగంటి సూచించారు.

లోకేశ్‌పై చాగంటి ప్రశంసలు

ఈ సందర్భంగా రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై చాగంటి కోటేశ్వరరావు ప్రశంసలు కురిపించారు. “పిల్లల్లో దేశభక్తి, నైతిక విలువలు పెంపొందించాలనే ఉద్దేశంతో ఈ ‘భారతీయం’ కార్యక్రమం గురించి చెప్పడానికి మంత్రి లోకేష్ గారి ఇంటికి వెళ్లాను. ఆయన వెంటనే స్పందించి తప్పకుండా వస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమానికి చెప్పిన సమయం కంటే ముందే వచ్చి హాజరయ్యారు. ఆయనలో దేశం, చరిత్ర పట్ల ఉన్న ఆసక్తికి ఇది నిదర్శనం. తిరిగి వెళ్తున్నప్పుడు నా కారు వద్దకు వచ్చి, డ్రైవర్‌తో జాగ్రత్తగా తీసుకెళ్లమని చెప్పడం ఆయన సంస్కారాన్ని తెలియజేస్తుంది. ఇంతటి దేశభక్తి, పెద్దల పట్ల గౌరవం ఉన్న వ్యక్తి మన రాష్ట్రానికి విద్యాశాఖ మంత్రి కావడం విద్యార్థుల అదృష్టం” అని అభినందించారు. స్వాతంత్ర్యం మనకు ఊరికే రాలేదని, దాని వెనుక ఉన్న త్యాగాలకు మనమే వారసులమని పిల్లలకు అర్థమయ్యేలా ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఆయన పేర్కొన్నారు.

దుబాయ్-కడప ఫ్లైట్ టికెట్లు బుక్ చేస్తున్నారా? ఇది మీకోసమే!

దుబాయ్-కడప విమాన సర్వీసుపై వదంతులు

ప్రచారంలో నిజం లేదన్న కడప ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్

టికెట్ల పేరుతో మోసపోయే ప్రమాదం ఉందని హెచ్చరిక

సమాచారం కోసం అధికారులను సంప్రదించాలని సూచన

అమరావతి,సామాన్యుడి అస్త్రం

ఈ నెల 23 నుంచి దుబాయ్-కడప మధ్య ఇండిగో



విమాన సర్వీసులు ప్రారంభం కానున్నట్లు సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని కడప విమానాశ్రయ డైరెక్టర్ సుజిత్ కుమార్ పొద్దార్ స్పష్టం చేశారు. ఈ మేరకు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని, ప్రజలు వీటిని నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు.దుబాయ్-కడప మధ్య విమాన సర్వీసులకు సంబంధించి ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదని డైరెక్టర్ తెలిపారు. ఇటువంటి తప్పుడు సమాచారాన్ని ఆసరాగా చేసుకుని కొందరు ట్రావెల్ ఏజెంట్లు టికెట్ల పేరుతో ప్రజలను మోసం చేసే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. ప్రయాణికులు అనధికారిక వార్తలను నమ్మి టికెట్లు బుక్ చేసుకోవద్దని ఈ సందర్భంగా సూచించారు.భవిష్యత్తులో ఏవైనా అంతర్జాతీయ విమాన సర్వీసులు ప్రారంభించాల్సి వస్తే, విమానాశ్రయ అధికారులు అధికారికంగా ప్రకటిస్తారని ఆయన వివరించారు. విమాన సర్వీసులపై ఎటువంటి సందేహాలున్నా సోషల్ మీడియా పోస్టులపై ఆధారపడకుండా, నేరుగా విమానాశ్రయ అధికారులను లేదా సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

రూ.వేలు ఖర్చు పెట్టాల్సిన పని లేదు..

జామపండులో గణనీయ ప్రొటీన్
శాకాహారులకు బఠానీ మంచి ఎంపిక
మినప్పప్పు పోషకాలతో నిండిన ఆహారం
శనగపిండిలో కూడా ప్రొటీన్ మోతాదు ఎక్కువే
గుమ్మడి గింజలు, వేరుశెనగలు పోషక విలువలు కలిగిన ఆహారాలు



ఆరోగ్యంపై అవగాహన పెరుగుతున్న కొద్దీ ప్రొటీన్ గురించి చర్చ కూడా ఎక్కువవుతోంది. శరీర ఎదుగుదల, కండరాల బలం, రోజువారీ శక్తి కోసం ప్రొటీన్ కీలకమని వైద్యులు చెబుతున్నారు. అయితే ప్రొటీన్ అంటే చాలామందికి గుడ్లు, చికెన్, చేపలు లేదా ఖరీదైన సప్లిమెంట్లే గుర్తుకొస్తాయి. దీంతో శాకాహారులు తమకు సరిపడా ప్రొటీన్ అందదేమోనని ఆందోళన చెందుతుంటారు. కానీ నిపుణుల అభిప్రాయం మాత్రం భిన్నంగా ఉంది. రోజూ మన ఇళ్లలో వాడే కొన్ని సాధారణ ఆహార పదార్థాల్లోనే మంచి మోతాదులో ప్రొటీన్ దొరుకుతుందని చెబుతున్నారు.పండ్లలో జామపండు ఈ జాబితాలో ముందుగా చెప్పుకోవాల్సినది. సాధారణంగా జామను విటమిన్-సి కోసం తింటారు. కానీ ఇందులో ప్రొటీన్ కూడా గణనీయంగా ఉంటుంది. మార్కెట్‌లో తక్కువ ధరకు దొరికే ఈ పండు పోషకాల పరంగా మాత్రం చాలా విలువైనదిగా భావిస్తారు. పిల్లల నుంచి పెద్దల వరకు అందరూ సులభంగా తినగలిగే ఆహారం కావడం మరో ప్రత్యేకత.కూరగాయల విషయానికి వస్తే బఠానీ మంచి ప్రొటీన్ మూలంగా గుర్తింపు పొందింది. కూరల్లో, పలావ్‌లలో, స్నాక్స్‌లో తరచూ ఉపయోగించే బఠానీ శరీరానికి ప్రొటీన్‌తో పాటు పీచుపదార్థాన్ని కూడా అందిస్తుంది. అందుకే శాకాహారం తీసుకునేవారు దీన్ని తరచూ ఆహారంలో భాగం చేసుకోవాలని సూచిస్తున్నారు.మన వంటింట్లో ఎప్పుడూ కనిపించే మినప్పప్పు కూడా ప్రొటీన్‌కు మంచి వనరు. ఇడ్లీ, దోశ, వడ వంటి వంటకాల ద్వారా ఇది దాదాపు ప్రతి ఇంట్లో ఆహారంలో చేరుతోంది. శరీరానికి అవసరమైన పోషకాలను అందించడంలో మినప్పప్పు కీలక పాత్ర పోషిస్తుందని నిపుణులు చెబుతున్నారు. శనగపిండిలో కూడా ప్రొటీన్ మోతాదు ఎక్కువగానే ఉంటుంది. పకోడీలు, చిల్లాలు, ఇతర పిండివంటల రూపంలో ఇది చాలా ఇళ్లలో వాడుతుంటారు. రుచితో పాటు పోషక విలువలు కూడా ఉండటంతో శనగపిండిని ఆరోగ్యకరమైన ఆహారంగా పరిగణిస్తారు.ప్రొటీన్ గురించి మాట్లాడేటప్పుడు గుమ్మడి గింజలు, పల్లీలనూ మర్చిపోవద్దని నిపుణులు సూచిస్తున్నారు. గుమ్మడి గింజల్లో ప్రొటీన్‌తో పాటు ఇతర పోషకాలు కూడా సమృద్ధిగా ఉంటాయి. వేరుశెనగలు అయితే తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు అందించే ఆహారాల్లో ఒకటిగా గుర్తింపు పొందాయి. వీటిని నేరుగా తినొచ్చు. లేకపోతే ఇతర వంటకాలతో కలిపి తీసుకోవచ్చు.అయితే ఒక్క ఆహారం మీదే ఆధారపడకుండా సమతుల ఆహారం తీసుకోవడం ముఖ్యం. ప్రొటీన్‌తో పాటు విటమిన్లు, ఖనిజాలు, పీచుపదార్థాలు కూడా శరీరానికి అవసరమే. అందుకే రోజువారీ ఆహారంలో వైవిధ్యానికి ప్రాధాన్యం ఇవ్వాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

ఖాళీ కడుపుతో బ్లాక్ కాఫీ తాగుతున్నారా?

కెఫిన్ వేగంగా శరీరంలోకి ప్రవేశం
కొందరిలో ఆందోళన పెరిగే అవకాశం
గుండె దడ, చిరాకు లక్షణాలు
మానేయాల్సిన అవసరం లేదని డాక్టర్ల సూచన
అల్పాహారం తర్వాత తాగితే మంచిదని హితవు



ఉదయం నిద్ర లేచిన కాసేపటికే కొందరికి కాఫీ తాగకపోతే రోజు మొదలైనట్లే అనిపించదు. ముఖ్యంగా బ్లాక్ కాఫీ తాగే వాళ్లు రోజురోజుకూ పెరుగుతున్నారు. బరువు తగ్గాలనుకునేవాళ్లు, ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టేవాళ్లు దీన్ని ఎక్కువగా ఇష్టపడుతున్నారు. అయితే ఖాళీ కడుపుతో బ్లాక్ కాఫీ తాగే అలవాటు కొందరిలో ఆందోళన, గుండె దడ, చిరాకు వంటి సమస్యలను పెంచే అవకాశం ఉందని తాజా పరిశోధనలు చెబుతున్నాయి.

ఎందుకు టెన్షన్?

రాత్రంతా ఏమీ తినకుండా ఉండటం వల్ల ఉదయం కడుపు ఖాళీగా ఉంటుంది. అలాంటి సమయంలో బ్లాక్ కాఫీ తాగితే అందులోని కెఫిన్ చాలా వేగంగా శరీరంలోకి చేరుతుంది. దీంతో మెదడు ఒక్కసారిగా అలర్ట్ అవుతుంది. కొందరిలో ఇది గుండె వేగంగా కొట్టుకోవడం, చేతులు స్వల్పంగా వణకడం, ఏదో తెలియని ఆందోళన కలగడం వంటి లక్షణాలకు కారణమవుతుంది.

అందరికీ ఒకేలా ప్రభావం ఉండదు

ఖాళీ కడుపుతో కాఫీ తాగినా కొంతమందికి ఎలాంటి ఇబ్బంది ఉండకపోవచ్చు. కానీ ఇప్పటికే ఆందోళన సమస్యలు ఉన్నవాళ్లు, ఒత్తిడి ఎక్కువగా ఎదుర్కొంటున్నవాళ్లు, కెఫిన్ సెన్సిటివిటీ ఉన్నవాళ్లలో ప్రభావం ఎక్కువగా కనిపించే అవకాశం ఉంది. కారణం లేకుండా టెన్షన్ రావడం, చిరాకు పెరగడం, దేనిపైనా దృష్టి నిలవకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త పడాల్సిందే.

నిపుణులు ఏం చెబుతున్నారు?

కాఫీని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. అయితే లేవగానే తాగడం కంటే అల్పాహారం చేసిన తర్వాత తాగడం మంచిదని వివరిస్తున్నారు. ఆకలి లేకపోయినా కనీసం పండు, బిస్కెట్ లేదా తేలికపాటి ఆహారం తీసుకున్న తర్వాత కాఫీ తాగితే కెఫిన్ ప్రభావం ఒక్కసారిగా పెరగకుండా ఉంటుంది. దీంతో ఆందోళన వంటి సమస్యలు తగ్గే అవకాశం ఉంటుంది.

కాఫీ మంచిదే.. కానీ..

బ్లాక్ కాఫీ వల్ల ఏకాగ్రత పెరగడం, అలసట తగ్గడం వంటి ప్రయోజనాలు ఉన్నాయి. అయితే ఏ ఆహారమైనా, పానీయమైనా మితంగా తీసుకున్నప్పుడే మంచి ఫలితం ఉంటుంది. ముఖ్యంగా ఖాళీ కడుపుతో తాగే అలవాటు వల్ల మీకు అసౌకర్యం కలుగుతోందని అనిపిస్తే సమయాన్ని మార్చుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.

ఆహారం గురించి భగవద్గీత ఏం చెబుతోంది?

సాత్విక ఆహార భావన వేదకాలం నాటిది కాదని చెప్పిన దేవదత్ పట్నాయక్
భగవద్గీత 17వ అధ్యాయం ద్వారానే ఈ వర్గీకరణకు ప్రాచుర్యం
సృష్టిలోని త్రిగుణాల సిద్ధాంతాన్ని ఆహారానికి అన్వయించిన గీత
ఈ ఆహార వర్గీకరణకు, చాతుర్వర్ణ వ్యవస్థకు సంబంధం ఉందని విశ్లేషణ
ఆహారం ద్వారా వ్యక్తి ప్రవర్తన, ఆధ్యాత్మికతను గీత ముడిపెట్టిందని వెల్లడి



ప్రస్తుతం యోగా, ఆయుర్వేదం, వెల్నెస్ సంస్కృతిలో విరివిగా ప్రాచుర్యంలో ఉన్న 'సాత్విక ఆహారం' అనే భావన వేదకాలం నాటిది కాదని, దీనిని భగవద్గీత ఆవిష్కరించి, ప్రాచుర్యంలోకి తెచ్చిందని ప్రముఖ పురాణాల విశ్లేషకుడు దేవదత్ పట్నాయక్ ఒక ఆసక్తికరమైన వాదనను ముందుంచారు. 'డెక్కన్ హెరాల్డ్' పత్రికలో రాసిన ఒక వ్యాసంలో ఆయన ఈ విశ్లేషణ చేశారు. ఆహారాన్ని సాత్విక, రాజస, తామస గుణాలుగా వర్గీకరించే పద్ధతి ప్రాచీన వేద గ్రంథాలలో ప్రముఖంగా కనిపించదని, భగవద్గీతలోని 17వ అధ్యాయంలోనే దీనిని స్పష్టంగా అభివృద్ధి చేశారని ఆయన పేర్కొన్నారు.సృష్టిలోని ప్రాథమిక గుణాలైన సత్వం (స్వచ్ఛత), రజస్సు (చలనం/ఆశ), తమస్సు (జడత్వం/అజ్ఞానం) అనే త్రిగుణాల సిద్ధాంతాన్ని భగవద్గీత తొలిసారిగా 'ఆహారం' (ఆహార్)కు అన్వయించిందని పట్నాయక్ వివరించారు. దీని ద్వారా వ్యక్తి తీసుకునే ఆహారానికి, అతని మానసిక స్థితికి, ప్రవర్తనకు, ఆధ్యాత్మిక స్థాయికి ప్రత్యక్ష సంబంధం ఉందని గీత స్పష్టం చేసిందని తెలిపారు. ఈ వర్గీకరణ ద్వారా ఆహారం కేవలం శరీర పోషణకే కాకుండా, ఆత్మ నియంత్రణకు, ధర్మబద్ధమైన జీవనానికి ఒక సాధనంగా మారింది.

గీతలో ఆహార వర్గీకరణ ఇలా...

భగవద్గీత 17వ అధ్యాయంలోని 8 నుంచి 10వ శ్లోకాల వరకు మూడు రకాల ఆహారాల గురించి విపులంగా వర్ణించారు. సాత్విక ఆహారం: రసవంతమైనవి, కొవ్వుతో కూడినవి, పుష్టినిచ్చేవి, హృదయానికి ఆనందాన్ని కలిగించేవి సాత్విక ఆహారాలు. ఇవి ఆయుష్షు, బలం, ఆరోగ్యం, సుఖం, సంతృప్తిని పెంపొందిస్తాయి. తాజా పండ్లు, కూరగాయలు, పాలు, నెయ్యి వంటివి దీని కిందకు వస్తాయి.

రాజస ఆహారం: చేదు, పులుపు, ఉప్పు, అతి వేడిగా, కారంగా, పొడిగా ఉండే ఆహారాలు రాజసికమైనవి. ఇవి దుఃఖం, వ్యాధి, అశాంతిని కలిగిస్తాయి. అతి మసాలాలు, ప్రేరేపిత పదార్థాలు ఈ కోవలోకి చెందుతాయి.

తామస ఆహారం: చల్లారిన, రుచిలేని, కుళ్ళిన, అపవిత్రమైన ఆహారాన్ని తామసికంగా పరిగణిస్తారు. నిల్వ ఉన్న పదార్థాలు, మాంసాహారం, ఉల్లి, వెల్లుల్లి వంటివి తామస గుణాన్ని పెంచి, వ్యక్తిలో జడత్వం, మందబుద్ధి, అజ్ఞానాన్ని పెంచుతాయి.

వర్ణ వ్యవస్థతో సంబంధం

ఈ ఆహారపు అలవాట్లను, గుణాలను గీత చాతుర్వర్ణ వ్యవస్థతో కూడా ముడిపెట్టిందని పట్నాయక్ తన విశ్లేషణలో తెలిపారు. ఇది పరోక్షంగా సామాజిక, ఆధ్యాత్మిక అంతరాలను బలపరిచేందుకు దోహదపడిందనేది ఆయన వాదన. ఈ విధంగా, భగవద్గీత ఆహారానికి ఒక నైతిక, ఆధ్యాత్మిక చట్రాన్ని అందించిందని పట్నాయక్ తన కథనంలో ముగించారు.

మామిడిపండ్లతో ఈ కాంబినేషన్లు అదుర్స్!



భారత్‌లో పీక్స్ కు చేరిన మామిడి పండ్ల సీజన్
సాధారణ భోజనంలో మామిడి పండ్ల వినియోగంపై పెరుగుతున్న ఆసక్తి
పెరుగన్నంతో మామిడి పండు తెలుగు వారి ఫేవరెట్ కాంబినేషన్
దేశంలోని వివిధ ప్రాంతాల్లో ప్రాచుర్యం పొందిన విభిన్న కాంబినేషన్లు
మామిడిని డెజర్ట్‌గానే కాకుండా భోజనంలోనూ ఆస్వాదిస్తున్న జనం

భారత్‌లో వేసవి కాలం గరిష్ఠ స్థాయికి చేరడంతో, మామిడి పండ్ల సీజన్ కూడా ఊపందుకుంది. ఈ నేపథ్యంలో, మామిడి పండ్లను కేవలం డెజర్ట్‌లు లేదా పానీయాలకే పరిమితం చేయకుండా, రోజువారీ భోజనంలో భాగంగా ఆస్వాదించే సంప్రదాయ పద్ధతులపై మళ్లీ ఆసక్తి పెరుగుతోంది. 'ది హిందూ' కథనం ప్రకారం... దేశవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన కొన్ని ప్రత్యేకమైన కాంబినేషన్లు ఇవే:

పెరుగన్నం – మామిడి పండు: తెలుగు రాష్ట్రాల్లో ఇది చాలా ఇష్టమైన కాంబినేషన్. వేసవిలో భోజనం ముగించడానికి ఇది ఒక అద్భుతమైన ఎంపికని రెస్టారెంట్ నిర్వాహకుడు సంపత్ తుముల పేర్కొన్నారు. కమ్మనైన, రుచికరమైన పెరుగన్నం, మామిడి పండులోని తియ్యదనంతో కలిసి అద్భుతమైన అనుభూతిని ఇస్తుంది.

పప్పు, అన్నం, మామిడి: అసోంలో చాలా కుటుంబాలు మసూర్ పప్పు, ఉడికించిన అన్నం, బంగాళాదుంప మ్యాష్‌తో పాటు తాజా మామిడి పండు ముక్కలను కలిపి తింటాయి. మామిడి పండ్ల సీజన్‌లో ఇది చాలా సులభమైన, రుచికరమైన భోజనం.

ఆమ్రస్ – పూరీ/రోటీ: గుజరాతీ, మహారాష్ట్ర సంప్రదాయాల్లో మామిడి పండ్ల గుజ్జును (ఆమ్రస్) పూరీలతో కలిపి అందిస్తారు. ముఖ్యంగా బోహ్రా కమ్యూనిటీలో, పాలు కలిపిన ఆమ్రస్‌ను ఉదయం అల్పాహారంలో భాగంగా రోటీలు లేదా చపాతీలతో తింటారు.

మ్యాంగో సలాడ్: తరిగిన మామిడి ముక్కల్లో కొద్దిగా ఉప్పు, పచ్చి మిరపకాయలు కలిపి తయారుచేసే స్వీట్ అండ్ సోర్ మ్యాంగో సలాడ్ కూడా మంచి ఆప్షన్. దీన్ని స్నాక్‌గా లేదా డిప్‌గా కూడా ఉపయోగించవచ్చు.

అటుకులు – మామిడి: ఒడిశాలో పాలు, చక్కెరలో నానబెట్టిన అటుకులను (పోహా) మామిడి పండు ముక్కలు, తురిమిన కొబ్బరితో కలిపి అల్పాహారంగా తీసుకుంటారు. ఇది ఎంతో సంప్రదాయ రుచిని అందిస్తుంది.రవ్వ పొంగల్/కేసరి – మామిడి: తీపి రవ్వ పొంగల్ లేదా రవ్వ కేసరిపై మామిడి పండు ముక్కలు వేసుకుని తినడం కూడా ఒక విభిన్నమైన అనుభూతిని ఇస్తుంది. దీని రుచి తప్పకుండా అందరికీ నచ్చుతుంది.ఈ ఉదాహరణలన్నీ భారతీయ వేసవి వంటకాల్లో మామిడి పండుకు ఉన్న ప్రాధాన్యతను తెలియజేస్తున్నాయి. విస్తృతంగా లభించే ఈ పండును స్థానిక సంప్రదాయాలకు అనుగుణంగా ప్రజలు ఎలా ఆస్వాదిస్తున్నారో స్పష్టం చేస్తున్నాయి.

టీచర్ గా ఆదాయం చాలక క్లౌడ్ కిచెన్ తెరిచింది



ట్యూషన్ల ద్వారా నెలకు రూ.9 వేలు మాత్రమే సంపాదించిన టీచర్
స్నేహితుడి సలహాతో రూ.50 వేల పెట్టుబడితో క్లౌడ్ కిచెన్ ప్రారంభం
ప్రస్తుతం నెలకు రూ.1.25 లక్షలకు పైగా ఆదాయం
ఖర్చులన్నీ పోను నెలకు రూ.60,000 వరకు ఆదా

వారణాసికి చెందిన ఓ మహిళా టీచర్ సాధించిన విజయం ఇప్పుడు సోషల్ మీడియాలో ఎంతో స్ఫూర్తినిస్తోంది. ట్యూషన్లు చెబుతూ నెలకు కేవలం రూ.9 వేలు సంపాదించే ఆమె, ఇప్పుడు క్లౌడ్ కిచెన్ వ్యాపారంతో నెలకు రూ.1.25 లక్షలకు పైగా టర్నోవర్ సాధిస్తున్నారు. అన్ని ఖర్చులు పోగా నెలకు సుమారు రూ.60,000 ఆదా చేస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.వారణాసిలో సొంతంగా జీవిస్తున్న ఈ మహిళ, రోజుకు నాలుగు నుంచి ఐదు గంటలు ట్యూషన్లు చెప్పినా వచ్చే డబ్బు ఇంటి అద్దె, ఇతర ఖర్చులకు సరిపోయేది కాదు. ఆర్థిక ఇబ్బందులతో కొన్నిసార్లు తండ్రి సహాయం తీసుకునేవారని ఆమె స్నేహితుడు అంకిత్ పాండే సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ఈ క్రమంలోనే అంకిత్ ఆమెకు ఓ విలువైన సలహా ఇచ్చారు. "సమయాన్ని అమ్మి డబ్బు సంపాదించడం ఆపి, నీ వంట నైపుణ్యాన్ని వ్యాపారంగా మార్చుకో" అని ప్రోత్సహించారు.స్నేహితుడి సలహాతో ఆమె తన దగ్గరున్న రూ.30 వేలు, అంకిత్ ఇచ్చిన రూ.20 వేలతో కలిపి మొత్తం రూ.50 వేల పెట్టుబడితో క్లౌడ్ కిచెన్ ప్రారంభించారు. జొమాటో, స్విగ్గీ వంటి యాప్‌లలో వ్యాపారాన్ని నమోదు చేశారు. మొదట్లో ఒక్క ఆర్డర్ కూడా రాని రోజులున్నా పట్టు వదలకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించడంపైనే దృష్టి పెట్టారు. క్రమంగా రుచి, సరైన ధరల వల్ల కస్టమర్ల నుంచి మంచి స్పందన వచ్చింది.ప్రస్తుతం ఆమె రోజుకు 15-20 ఆర్డర్లు అందుకుంటున్నారు. వ్యాపారం పెరగడంతో ఓ చెఫ్‌ను కూడా నియమించుకున్నారు. చెఫ్ జీతం, అద్దె, ప్యాకేజింగ్ ఖర్చులు పోను ఆమెకు నెలకు రూ.60,000 వరకు మిగులుతోంది. భవిష్యత్తులో ఈ వ్యాపారాన్ని మరింత విస్తరించే ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. నైపుణ్యం ఉంటే స్వయం ఉపాధిలో ఎంతగా రాణించవచ్చో ఈమె కథ నిరూపిస్తోందని నెటిజన్లు ప్రశంసిస్తున్నారు.

హీరోయిన్ నుంచి విలన్‌గా.. ఆ పాత్రకైనా రెడీ అంటున్న భాగ్యశ్రీ

పాత్ర ఎలాంటిది అన్నది ముఖ్యం కాదు.. నటనకు అవకాశం ఉంటే ఏ తరహా పాత్రనైనా పోషించడానికి సిద్ధం. అవసరమైతే విలన్‌గా కూడా నటిస్తా' అంటున్నది మరాఠీ భామ భాగ్యశ్రీబోర్సే. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ తన కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికరమైన విషయాలను భాగ్యశ్రీ వెల్లడించింది. 'అసలు నటిని కావాలనే ఆలోచనే నాకు లేదు. బిజినెస్ మేనేజ్‌మెంట్ చదువుకున్న నేను.. అనుకోకుండా మోడలింగ్‌లో అడుగుపెట్టా. అక్కడ మంచి పేరొచ్చింది.సినిమాల్లోకి వెళితే ఇంకా ఫేమ్ వస్తుందని ఫ్రెండ్స్ చెప్పడంతో ప్రయత్నం చేశా. అనుకోకుండా అవకాశాలు వచ్చాయి. అయితే.. ప్రారంభంలోనే ఒడిదుడుకులు ఎదుర్కొన్నా. పెద్దగా ఆడకపోయినా 'కాంత' సినిమా నటిగా నాకు సంతృప్తినిచ్చింది. అందులోని నా నటనను 'మహానటి'లో కీర్తి సురేశ్ నటనతో చాలా మంది పోల్చారు. అది నాకు ఆనందాన్నిచ్చే విషయం. ఇక సక్సెస్ రుచిని చూపించిన సినిమా 'లెనిన్'. ప్రస్తుతం శివకార్తికేయన్‌తో చేస్తున్న 'సెయోన్'లో కూడా నటనకు ఆస్కారమున్న పాత్రే చేస్తున్నా' అంటూ చెప్పుకొచ్చింది భాగ్యశ్రీ బోర్సే.



థియేటర్లు ఊగిపోతాయ్



కథలో నుంచి వచ్చిన లుక్ అది. చాలా కొత్తగా అనిపించింది. ఇందులో క్యారెక్టర్ సొసైటీలో పెరిగిన వ్యక్తి కాదు. ఆ క్యారెక్టర్‌కు బిగినింగ్ నుంచే ఒక మ్యాన్షన్ ఉంటుంది. నిజానికి తెలుగులోనే ఇలాంటి క్యారెక్టర్ చాలా కొత్త. నా మీద ఆ క్యారెక్టర్ ఫ్రెష్‌గా ఉంటుంది. జడలతో లుక్ చూసి సర్‌ప్రైజ్ అయ్యారు. ఇందులో ప్రతి డీటెయిల్‌కు ఒక కారణం ఉంటుంది. ఇందులో మీరు చూస్తుంది సవారీల బొట్టు. ఎవరినైనా బలవంతంగా తీసుకెళ్లి టాటూ వేస్తే వాడు సవారీ అయిపోయినట్టే. అలాగే ముక్కుపుడక, చైను అన్నిటికీ ఒక ఇంపార్టెన్స్ ఉంటుంది.

'మైసా' నుంచి పవర్‌ఫుల్ టీజర్



'నేషనల్ క్రష్' రష్మిక మందన్న తన సరికొత్త అవతారంతో ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. ఆమె ప్రధాన పాత్రలో నటిస్తున్న 'మైసా' చిత్రం నుంచి విడుదలైన టీజర్ సోషల్ మీడియాలో సంచలనం సృష్టిస్తోంది. ఇప్పటివరకు గ్లామరస్, క్యూట్ పాత్రలతో అలరించిన రష్మిక, ఈసారి పూర్తి భిన్నంగా ఒక పవర్‌ఫుల్ యాక్షన్ పాత్రలో కనిపించి అందరికీ షాకిచ్చారు. ఈ టీజర్ ప్రస్తుతం యూట్యూబ్‌లో ట్రెండింగ్‌లో ఉంది'మైసా' టీజర్‌లో రష్మికను ఒక శక్తివంతమైన గోండు గిరిజన మహిళగా చూపించారు. రక్తంతో తడిసిన ముఖం, చేతిలో ఆయుధాలు, తీవ్రమైన పోరాట సన్నివేశాలతో ఆమె లుక్ సినిమాపై అంచనాలను భారీగా పెంచింది. ముఖ్యంగా, "యుద్ధానికి ఆయుధం అంటే భయం కానీ.. ఆయుధం ఏ యుద్ధానికి భయపడదు" అనే డైలాగ్ టీజర్‌కు హైలైట్‌గా నిలిచింది. రష్మిక కెరీర్‌లో ఇది ఒక మేజర్ టర్నింగ్ పాయింట్‌గా నిలుస్తుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.ఈ యాక్షన్ థ్రిల్లర్ చిత్రంతో రవీంద్ర పుల్లే దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఈయన గతంలో ప్రముఖ దర్శకుడు హను రాఘవపూడి వద్ద సహాయకుడిగా పనిచేశారు.

సంగీత్ రాగాలు మొదలు



యువతను ఆకట్టుకునే ప్రేమకథా చిత్రంగా తెరకెక్కుతున్న 'సంగీత్(ఖుఅస్త్రవవ్)' నుంచి తొలి పాట 'నీ వల్లే' విడుదలైంది. తద్వారా 'సంగీత్' మ్యూజికల్ జర్నీకి మేకర్స్ ప్రత్యేకంగా శ్రీకారం చుట్టారు. విక్రమ్ శివ ఈ పాటకు సాహిత్యాన్ని అందించారు. లహరి ఫిల్మ్స్, ఆర్బీ స్టూడియోస్ బ్యానర్లపై జీ మనోహరన్, ఎల్ బాలకృష్ణ సమర్పణలో 'సంగీత్' తెరకెక్కుతోంది. నవీన్ మనోహరన్, చంద్రు మనోహరన్, శ్రవంతి నవీన్ నిర్మాతలుగా వ్యవహరిస్తుండగా, మాజ్ ఖాన్ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు.కన్నడలో తెరకెక్కిన 'హంబుల్ పొలిటీషియన్ నోగ్రాజ్' చిత్రంతో దర్శకుడిగా గుర్తింపు పొందిన సాద్ ఖాన్ 'సంగీత్'కు దర్శకత్వం వహిస్తున్నారు. సాద్ ఖాన్, సిద్ధాంత్ సుందర్ కలిసి కథను రచించారు.. ప్రముఖ డిజిటల్ పర్సనాలిటీ, పోడ్కాస్ట్ హోస్ట్‌గా గుర్తింపు పొందిన నిఖిల్ విజయేంద్ర సింహా 'సంగీత్'తో కథానాయకుడిగా వెండితెరకు పరిచయం అవుతున్నారు. ఆయనకు జోడీగా తేజు అశ్విని నటిస్తున్నారు.

ఆ హీరోయిన్‌కి ఉదయభాను డబ్బింగ్..

తెలుగు సినీ పరిశ్రమలో ఇతర భాషల కథానాయికలకు మన తెలుగు నటీమణులు, యాంకర్లు, గాయకులు డబ్బింగ్ చెప్పడం సాధారణమే. అయితే కొన్ని సందర్భాల్లో తాము డబ్బింగ్ చెప్పిన విషయం కూడా ప్రేక్షకులకు తెలియకుండా పోతుంది. తాజాగా సీనియర్ యాంకర్, నటి ఉదయభాను తనకు సంబంధించిన అలాంటి ఆసక్తికరమైన విషయాన్ని వెల్లడించింది. ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ యాంకర్‌గా మంచి గుర్తింపు తెచ్చుకున్న ఉదయభాను.. యాంకరింగ్‌తో పాటు నటిగా కూడా పలు సినిమాల్లో కనిపించింది. ఆ తర్వాత వివాహం, పిల్లల కారణంగా కొంతకాలం కెరీర్‌కు దూరంగా ఉంది. ప్రస్తుతం మళ్లీ నటిగా రీఎంట్రీ ఇచ్చిన ఆమె.. మరోవైపు నిర్మాతగానూ వ్యవహరిస్తోంది. తాను నిర్మించిన 'పంచనామా' సిరీస్ ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన డబ్బింగ్ కెరీర్‌కు సంబంధించిన ఆసక్తికర విషయాలను వెల్లడించింది.తాను ప్రముఖ నటి ఛార్మికి 'శ్రీ ఆంజనేయం' సినిమాలో డబ్బింగ్ చెప్పినట్లు ఉదయభాను తెలిపింది. అయితే ఛార్మి మాట్లాడే విధానాన్ని అనుకరిస్తూ, తన గొంతును కూడా మార్చుకుని డబ్బింగ్ చెప్పానని చెప్పింది. దీంతో ఆ సినిమాలో ఛార్మికి తాను డబ్బింగ్ చెప్పిన విషయం ప్రేక్షకులకు తెలియలేదని వెల్లడించింది. ఛార్మికి 'శ్రీ ఆంజనేయం' సినిమాలో డబ్బింగ్ చెప్పాను. ఆమె మాట్లాడే విధానాన్ని ఇమిటేట్ చేస్తూ డబ్బింగ్ చెప్పాను. ఆమె కొన్ని పదాలను ప్రత్యేకంగా పలుకుతుంది. అలాగే నా గొంతును కూడా మార్చుకుని చెప్పడంతో.. ఆ సినిమాకు నేను డబ్బింగ్ చెప్పానని ఎవరూ గుర్తించలేకపోయారు అని ఉదయభాను చెప్పింది. అంతేకాదు, ఆ సినిమాకు సంబంధించిన డబ్బింగ్ క్రెడిట్స్‌లో కూడా తన పేరు లేదని ఆమె పేర్కొంది.



ఫోన్లు పక్కనపెట్టి మాట్లాడుకోండి..

నేటి డిజిటల్ యుగంలో సోషల్ మీడియా, స్మార్ట్‌ఫోన్ల ప్రభావం మనుషుల మధ్య బంధాలపై కూడా పడుతోందని నటి కాజల్ అగర్వాల్ అభిప్రాయపడింది. ముఖ్యంగా భార్యాభర్తలు ఒకరితో ఒకరు మాట్లాడుకునేందుకు కూడా తగినంత సమయం కేటాయించకపోవడం ఆందోళన కలిగించే విషయమని ఆమె పేర్కొంది. కలిసి బయటకు వెళ్లిన సమయంలోనూ ఫోన్లలో మునిగిపోవడం వల్ల బంధాల్లో కమ్యూనికేషన్ తగ్గిపోతోందని చెప్పింది. కాజల్ అగర్వాల్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన విషయాలను కూడా ఈ సందర్భంగా పంచుకుంది. తన భర్త గౌతమ్ కిచ్లూతో కలిసి ప్రతి వారం కనీసం ఒకరోజు డిన్నర్‌కు బయటకు వెళ్తామని ఆమె తెలిపింది. ఆ సమయంలో ఇద్దరం ఫోన్లను పక్కన పెట్టి కేవలం ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి, కలిసి సమయం గడపడానికి ప్రాధాన్యత ఇస్తామని చెప్పింది.ప్రస్తుతం చాలా మంది జంటలు కలిసి ఉన్నప్పటికీ ఒకరితో ఒకరు మాట్లాడుకోవడానికి సమయం కేటాయించడం లేదని కాజల్ పేర్కొంది. డిన్నర్ డేట్‌కు వెళ్లినా చేతిలో ఫోన్ పట్టుకుని సోషల్ మీడియా చూస్తూ ఉండటం వల్ల పక్కనే ఉన్న వ్యక్తితోనే దూరం పెరుగుతోందని ఆమె అభిప్రాయపడింది. భార్యాభర్తల మధ్య మంచి అనుబంధం కొనసాగాలంటే ఒకరి అభిప్రాయాలను మరొకరు వినడం, మాట్లాడుకోవడం చాలా ముఖ్యమని కాజల్ సూచించింది. ఎంత బిజీగా ఉన్నప్పటికీ భాగస్వామితో కొంత సమయం గడపడం, తమ ఆలోచనలు, అనుభవాలను పంచుకోవడం అవసరమని చెప్పింది.



PRINTED AND PUBLISHED BY PANUTULA PRIYANKA, ON BEHALF OF PANUTULA PRIYANKA, PRINTED AT M/S.PARAHUSHAR PRINTING PUBLICATION, 1-4-36, SRINAGAR COLONY, MAHABUBABAD, WARANGAL TELANGANA -506101.AND PUBLISHED AT #H.NO.12-155, RAVINDER REDDY COMPLEX, NEAR HANUMANTEMPLE, IDA BOLLARAM MUNICIPALITY, JINNARAM MANDAL, SANGAREDDY DIST - 502325, TELANGANA STATE. EDITOR: PANUTULA PRIYANKA. RNI NO: TGTEL/25/A1872, Email: mathrubhoomiceo@gmail.com, Phone: 9182698313.